పరస్పర అవగాహనతో సమస్యల పరిష్కారం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్




మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్, హాజరైన పోలీసులు, న్యాయవాదులు

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో పరిపాలన పరంగా ఎన్నో సమస్యలు ఎదురవుతాయని.. వాటిని పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవచ్చని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని నూతన న్యాయస్థానాల భవనంలో ఆదివారం సమస్యలపై పరిష్కార అవగాహన సదస్సు నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ సమస్య ఎంత తీవ్రమైనా పరిష్కారానికి అనువైన మార్గాన్ని కనుగొనాలని సూచించారు. సీనియర్ న్యాయవాదులు యూఎస్ఆర్ రాజు, బండారు రామకృష్ణ, ఎన్.మాధవరావు, న్యాయ శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు మహ్మద్ ఫసియుద్దీన్ మాట్లాడుతూ పలు సమస్యలను న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల ఎస్పీలు తుహిన్‌సిన్హా, అమిత్ బర్దార్ విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు నమ్మి సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి వీవీ సుధాకర్, డీసీపీ విజయ్ మణికంఠ, ఏసీపీలు, న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వసూళ్లు.. చర్యలు నిల్!

- అక్రమ క్వారీలపై ఉదాసీన వైఖరి
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

ఈనాడు డిజిటల్ - అనకాపల్లి

జిల్లాలో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించేందుకు అధికారులు ఎడాపెడా అనుమతులు ఇచ్చేస్తున్నారు. లీజుదారులు పరిధి దాటి కొండంతా తవ్వేస్తున్నారు. క్వారీలపై మైనింగ్ అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదు. స్థానికంగా ఆందోళనలు జరిగితే తనిఖీలు చేస్తున్నారు. పరిమితికి మించి తవ్వకాలు చేస్తే కేసులు నమోదు చేసి నోటీసులు ఇవ్వడంతో పాటు జరిమానా విధిస్తున్నారు. అంతటితో తమ బాధ్యత తీరిపోయిందని మిన్నకుండిపోతున్నారు. జరిమానా వసూలు చేయడం, బాధ్యులపై చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

జరిమానా ఎగ్గొట్టేందుకు..

అనుమతులు కంటే అధికంగా తవ్వకాలు చేసినా, అనధికారికంగా క్వారీలు నిర్వహించినా మైనింగ్ అధికారులు కేసులు నమోదు చేసి జరిమానా విధించవచ్చు. స్థానికుల ఆందోళనలతో తనిఖీలు చేపడుతున్న అధికారులు నోటీసులు ఇచ్చి జరిమానా విధిస్తున్నారు. ఆ మొత్తం చెల్లించకుండా ఎగవేయాలన్న ఆలోచనతో క్వారీ నిర్వాహకులు అంత మొత్తం చెల్లించలేమంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నారు. వాద, ప్రతిపాదనలతో కేసు ఏళ్ల తరబడి సాగుతోంది. ఇటీవల పంచదార్ల కొండపై జరిగిన అక్రమ మైనింగ్‌పై లీజుదారుడిపై కేసు నమోదు చేసిన అధికారులు రూ.4.8 కోట్లు జరిమానాగా చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. దీనిపై లీజుదారు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు ఇప్పట్లో తేలేది కాదని మైనింగ్ సిబ్బందే చెప్పడం గమనార్హం.

ఫిర్యాదులు అందినా..


అనకాపల్లి జిల్లాలో 230 వరకు మెటల్, క్రషర్, గ్రావెల్ క్వారీలకు అనుమతులున్నాయి. ఇంతకు మూడింతలు అనధికారిక క్వారీలు నడుస్తున్నాయి. వీటిలో అధికంగా అనకాపల్లి మండలం మార్టూరు, మామిడిపాలెం, సీతానగరం, కూండ్రం, బాటజంగాలపాలెంలోనే ఉన్నాయి. నర్సీపట్నం డివిజన్‌లో రోలుగుంట, నాతవరం, చోడవరం మండలాల పరిధిలోనూ యథేచ్ఛగా నడుస్తున్నాయి. స్థానిక నేతల అండదండలు ఉండటంతో ఫిర్యాదులు వెల్లువెత్తినా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఉన్నతాధికారులు తనిఖీలకు బయలుదేరితే మైనింగ్ సిబ్బంది ముందే క్వారీ నిర్వాహకులకు సమాచారం ఇస్తున్నారు. ఈలోగా తవ్వకాలు జరిగే ప్రదేశం నుంచి యంత్రాలు, వాహనాలను తరలిస్తున్నారు.

రూ.5.5 కోట్లే వసూలు: అక్రమ మైనింగ్‌కు పాల్పడి జరిమానా చెల్లించాల్సిన క్వారీ యజమానులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తుండటంతో కేసులన్నీ పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. 2019-20 నుంచి ఇప్పటివరకు రూ.340.09 కోట్ల జరిమానా విధించగా.. వసూలైంది రూ.5.5 కోట్లే. వందల కేసులు కోర్టుల్లో ఏళ్లతరబడి సాగుతూనే ఉన్నాయి. అనధికార క్వారీలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే క్షేత్రస్థాయి సిబ్బందితో తనిఖీలు చేయిస్తున్నాం. బాధ్యులపై అపరాధ రుసుం విధిస్తున్నాం. వీరిలో చాలా మంది న్యాయస్థానాలను ఆశ్రయిస్తూ జరిమానా చెల్లించడం లేదు. - శివాజీ, మైనింగ్ ఏడీ



అనకాపల్లి రూరల్ కుంచంగి సమీపంలో అక్రమ మెటల్ క్వారీ..

రైతన్న గుండె 'చెరువు'



చీడికాడలో.. పెదగోగాడలో..

ఎల్‌నినో ప్రభావంతో చుక్క నీరు లేక సాగునీటి చెరువులు బీడు భూములను తలపిస్తున్నాయి. చీడికాడ మండలంలో సుమారు 200 చెరువులు ఉండగా.. ఆయకట్టు భూములన్నీ నెర్రెలిచ్చాయి. ఆగస్టు ముగుస్తున్నా చినుకు జాడ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలన్నా ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమయ్యేలా లేదని చెబుతున్నారు. - న్యూస్‌టుడే, చీడికాడ

నీట్ పీజీ పరీక్షకు 97.58 శాతం హాజరు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ కేంద్రంగా మూడు కేంద్రాల్లో ఆదివారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన నీట్ పీజీ పరీక్షకు 1,947 మంది అభ్యర్థులకు 1,900 మంది (97.58 శాతం) హాజరయ్యారని అధికారులు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రెండు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలో 1,387 మంది అభ్యర్థులకు 1,349 మంది హాజరైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. పరీక్ష సందర్భంగా వెస్ట్ జోన్ ఏసీపీ ప్రదీప్తి ఆధ్వర్యంలో పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. విశాఖ నగర ట్రాఫిక్ ఏడీసీపీ అన్నెపు నరసింహమూర్తి, వెస్ట్ సబ్ డివిజన్ ట్రాఫిక్ సీఐ సురేశ్ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.



నృత్య కళా వైభవం

సింహగిరిపై రెండు రోజులపాటు కొనసాగిన సాంస్కృతిక ఉత్సవాల్లో ఆదివారం సాయంత్రం విశాఖ మధురవాడకు చెందిన సిద్ధేంద్ర యోగి నాట్యాలయానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ కీర్తనలకు కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు సమ్మోహితులను చేశాయి. - న్యూస్‌టుడే, సింహాచలం



ఐక్యంగా పోరాడతాం.. ఆత్మగౌరవం కాపాడుకుంటాం ..వివరాలు 6లో...

నేడు పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ రద్దు

కలెక్టరేట్, అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా ఓ ప్రకటనలో తెలిపారు. జలహారతి కార్యక్రమంలో పాల్గొనేందుకు సెప్టెంబరు 2న పాయకరావుపేట రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారన్నారు. ఈ నేపథ్యంలో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ రద్దు చేసినట్లు వెల్లడించారు. సమస్యలపై వినతులు ఇచ్చేందుకు అర్జీదారులు ఎవరూ కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయానికి రావద్దని సూచించారు.

సాకారం కానున్న చిరకాల స్వప్నం



కలెక్టర్ విజయకృష్ణన్‌తో చర్చిస్తున్న మంత్రి అనిత

పాయకరావుపేట, నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర వాసుల చిరకాల స్వప్నం సెప్టెంబరు 2న నెరవేరనుందని హోం మంత్రి అనిత అన్నారు. గోదావరి జలాలకు సీఎం చంద్రబాబు జలహారతి ఇవ్వనున్న ప్రాంతాన్ని ఆదివారం రాత్రి పరిశీలించారు. కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్రతో కలిసి సభా ప్రాంగణాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. సీఎం పర్యటనకు సంబంధించి భద్రత ఏర్పాట్లను ఎస్పీ తుహిన్‌సిన్హా పరిశీలించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వినోద్‌బాబు, ఎస్సై పురుషోత్తం వెంట ఉన్నారు. జలహారతి కార్యక్రమంపై పేట నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ★ సీఎం చంద్రబాబు పర్యటనకు పేట ముస్తాబవుతోంది. తాండవ చక్కెర కర్మాగారం నుంచి పి.ఎల్.పురంలోని సభాస్థలి వరకు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. సీఎం కాన్వాయ్ అండర్‌పాస్ నుంచి వెళ్లేందుకు వీలు లేకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ పనులు చేపట్టారు. వై కూడలి నుంచి తుని వైపు వచ్చే కాన్వాయ్ నేరుగా నర్సీపట్నం రోడ్డులోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జాతీయ రహదారిపై లింగాలతోట కాలనీ వద్ద డివైడర్‌ను పొక్లెయిన్‌తో ఆదివారం తొలగించారు. శాంతినగర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించారు.

★ తాండవ నదిపై నిర్మించిన అక్విడక్టు సమీపంలో సీఎం చంద్రబాబు గోదావరి జలాలకు జలహారతి ఇవ్వనున్నారు. ఇక్కడే తాండవ నది, భూమి కాలువల్లోకి ముందుగా నీటిని విడుదల చేయనున్నారు. రెండు తలుపులతో ఉన్న ఆఫ్‌టేక్ స్లూయిస్ నిర్మించారు. జిల్లా ముఖద్వారం వద్ద గోదావరి జలాలను కాలువలోకి విడుదల చేసేందుకు వీలుగా ఆరు తలుపులతో స్లూయిస్ ఏర్పాటు చేశారు. ఈ పనులను ఈఈ లక్ష్మణరావు పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు రేణుశ్రీ ఎంపిక



రావికమతం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఆరో స్థానంలో నిలిచిన బాలిక గంజి రేణుశ్రీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. 51వ స్టేట్ యోగా స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్-2026 రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 29, 30 తేదీల్లో విశాఖపట్నం మున్సిపల్ స్టేడియంలో జరిగాయి. అండర్-12 బాలికల విభాగంలో రావికమతానికి చెందిన రేణుశ్రీ సత్తా చాటింది. పరవాడలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్లో ఆరో తరగతి చదువుతున్న ఈమె గత నెలలో అనకాపల్లిలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటడంతో నిర్వాహకులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.రవి శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.రామారావు పతకం, ప్రశంసాపత్రం అందజేశారు.

పాఠశాలల అభివృద్ధికి

ఆధునిక నేస్తం

వసతుల కల్పనకు తమిళనాడు తరహా ప్రయోగం

నర్సీపట్నం, న్యూస్‌టుడే

ప్రభుత్వ బడుల అభివృద్ధికి తాజాగా సర్కారు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. సమాజంలో విద్యాభివృద్ధిని కాంక్షించే వారి సహకారంతో పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుకు చర్యలు తీసుకోవాలని తలపెట్టింది. స్కూళ్ల బాగుకు తాము సైతం అంటూ ముందుకు వచ్చే వారి కోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. 'బడి కోసం' పేరిట అభివృద్ధి చేసిన ఈ యాప్‌లో బడులన్నింటిల్లోనూ ఇంకా అవసరమైన మౌలిక వసతులు నిక్షిప్తం చేశారు. వీటి ఆధారంగా సాయం చేయదలచిన వారంతా యాప్ ద్వారా తాము ఇవ్వదలచిన సొమ్మును బడి అభివృద్ధికి అందజేయవచ్చు. తమిళనాడు రాష్ట్రంలో విజయవంతమైన ఈ ప్రయోగాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలుచేయాలని నిర్ణయించారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులంతా ఇప్పుడు దీనిని విస్తృతంగా జనంలో తీసుకువెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

★ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సర్కారు బడుల్లో పూర్తిస్థాయి వసతులు కొరవడ్డాయి. దీని వల్ల విద్యార్థుల చదువులు కుంటుపడ్డాయి. కూటమి సర్కారు ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అనేక స్కూళ్లలో ఇంకా మరెన్నో సదుపాయాలు అవసరమవుతున్నాయి. వీటిని కొలిక్కి తేవడానికి దాతల సాయం తప్పని సరి అవుతోంది. ఇప్పటికే చాలా మంది తమ దాతృత్వం చాటుకున్నారు. ఇలాంటి వారి నిమిత్తం ప్రత్యేకంగా ఇప్పుడు బడి కోసం యాప్‌ను ప్రవేశపెట్టారు. దీనిని కేవలం విద్యాశాఖకు సంబంధించి పాఠశాలకు అవసరమైనవి సమకూర్చడానికి మాత్రమే ఉపయోగపడేలా రూపొందించారు. దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారులు, హెచ్ఎంలతో సమావేశమై యాప్‌పై ప్రచారాన్ని విస్తృతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ముందుగా దీనిని ప్రతి ఉపాధ్యాయుడు డౌన్‌లోడ్ చేసుకొని అందులోని అన్నింటిపైన పూర్తి అవగాహన పెంపొందించుకునేలా చూస్తున్నారు.

★ సబ్బవరం మండలంలోని ఆరిపాక జడ్పీ హైస్కూల్‌లో భోజనశాల నిర్మించేందుకు ఇప్పటికే ఈ యాప్ ద్వారా దాత ఒకరు ముందుకు వచ్చారు. పరవాడలోని స్కూళ్లలో సీఎస్ఆర్ నిధులతో రెండు భవనాలు నిర్మించేందుకు ముందుకొచ్చి యాప్‌లో వివరాలు నమోదు చేశారు. విద్యాభివృద్ధికి దోహదపడే బడుల బాగు కోరుకునే వారంతా ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్షా పథక అదనపు సమన్వయకర్త శ్రీరాములు కోరుతున్నారు. సాయం చేయదల్చిన వారంతా యాప్ ద్వారా సంబంధిత బడుల్లోని అభివృద్ధి పనులకు నిధులను సమకూర్చవచ్చన్నారు. భవనాలకే కాకుండా అవసరమైన నిర్మాణ సామగ్రి, ఫర్నిచర్ తదితర వేటికైనా ఇవ్వవచ్చని పేర్కొన్నారు.



సమగ్ర శిక్షా ఏపీసీ శ్రీరాములు

గిరిజన విద్యార్థుల కోసమే 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'


మారికవలసలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరిన విద్యార్థులతో మాట్లాడుతున్న కార్యదర్శి గౌతమి

కొమ్మాది, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి వారిని తీర్చి దిద్దడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఎం.గౌతమి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం మారికవలస బాలుర గురుకుల పాఠశాల క్యాంపస్‌ను అధికారులతో కలిసి సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్ చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. బీసీ, సోషల్ వెల్ఫేర్ శాఖల తరహాలోనే గిరిజన సంక్షేమశాఖకు ఈ ప్రత్యేక సీవోఈ మంజూరయిందన్నారు. దేశంలోనే ప్రముఖ విద్యాసంస్థ 'ఫిజిక్స్‌వాలా'ను ఆర్ఎఫ్‌పీ ప్రక్రియ ద్వారా ఎంపిక చేసినట్లు ఆమె వెల్లడించారు. ఉత్తరాంధ్ర, మైదాన ప్రాంత విద్యార్థులకు అనుకూలమైన ఎడ్యుకేషన్ హబ్ కావడంతో మారికవలసను ఎంపిక చేశామన్నారు. మెరిట్ ఆధారంగా 600మంది బాలురు, బాలికలను ఎంపిక చేశామన్నారు. గురుకులాల తరహాలో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పెంపొందించేందుకు కో-ఎడ్యుకేషన్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. బాలికలు, బాలురకు వేర్వేరుగా వసతి గృహాలు, తరగతి గదులు కేటాయించడంతో పాటు అదనపు సీసీ కెమెరాలు, ప్రత్యేక వార్డెన్లు, పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపల్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అపోహలు వీడాలి.. : తల్లిదండ్రులకు ముందే పూర్తి అవగాహన కల్పించి, విద్యార్థులకు ఘనంగా ఫేర్‌వెల్ ఇచ్చి వారి అభ్యర్థన మేరకు పక్కనే ఉన్న బాలికల క్యాంపస్, కృష్ణాపురం, సబ్బవరం గిరిజన గురుకులాలకు సురక్షితంగా బస్సుల్లో పంపించామని స్పష్టం చేశారు. రాత్రికి రాత్రే క్యాంపస్‌ను ఖాళీ చేశారనడంలో ఎలాంటి నిజం లేదని ఆమె తేల్చి చెప్పారు. ఈ చక్కటి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎస్.కె జిలాని తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మళ్లవీధికి చెందిన సరిసా జయసూర్య(28) ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో దిగులుగా ఉండేవాడు. దీంతో శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీనిపై మృతుడి తండ్రి వెంకట రామారావు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తెలిపారు.

ఐక్యంగా పోరాడతాం.. ఆత్మగౌరవం కాపాడుకుంటాం

నినదించిన మెగా డీఎస్సీ ఉపాధ్యాయులు

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీగా తరలొచ్చి నిరసన

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే

ఆత్మగౌరవం కోసం ఐక్యంగా పోరాడతామని మెగా డీఎస్సీ-2025 ఉద్యోగులు నినదించారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలతో విశాఖ బీచ్‌రోడ్డు ఆదివారం హోరెత్తింది. తమపై వస్తున్న అసత్య ఆరోపణలను ఖండిస్తూ మెగా డీఎస్సీ ఆత్మ గౌరవ పోరాట సమితి ఆధ్వర్యంలో చలో విశాఖ-ఆత్మ గౌరవ గర్జన నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరయ్యారు. వైఎంసీఏ వద్ద జరిగిన సభలో పలువురు మాట్లాడుతూ దగా డీఎస్సీ కాదు.. మెగా డీఎస్సీ అని, కష్టంతో సాధించామని..పాఠాలు మాత్రమే కాదని..గుణపాఠాలు చెబుతామని నినాదాలు చేశారు. అనంతరం ప్లకార్డులు చేతపట్టుకొని ర్యాలీ నిర్వహించారు. వైకాపా నేతలు తమపై అసత్య ఆరోపణలు చేస్తే బంగాళాఖాతంలో కలిపేస్తాం, ఇకపై తప్పుడు ప్రచారాలకు గట్టి సమాధానం చెబుతామని స్పష్టం చేశారు.


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

సముద్రంలా ఉప్పొంగుతాం: క్రీడా కోటాలో నాకు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది. గురువు అంటే ఉద్యోగం కాదు.. ఒక బాధ్యత. అలాంటి వృత్తిపై అసత్యప్రచారాలు మానుకోవాలి. ఎవరికైనా సందేహం ఉంటే చట్ట రీత్యా ఎదుర్కోండి. విద్యాశాఖ మంత్రి లోకేశ్ చర్చకు సిద్ధమని సవాలు విసిరినా ప్రతిపక్ష నేతలు ఎందుకు రాలేదు. మమ్మల్ని ఇబ్బంది పెడితే సహించం..ప్రశాంతంగా ఉన్న సముద్రాన్ని డిస్టర్బ్ చేస్తే పొంగినట్లు ఉప్పొంగుతాం. మా పోరాటంలో న్యాయం ఉంది. కష్టం, నిజం, నిరీక్షణ ఉన్నాయి. - షెహనాజ్, విశాఖ



ఇలా ఎవరూ రోడ్డెక్కలేదు..: డీఎస్సీ కోసం రాత్రి, పగలు తేడా లేకుండా చదివాం. నాకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒక వైపు కుటుంబాన్ని చూసుకుంటూ మరో వైపు డీఎస్సీకి సన్నద్ధమయ్యా. విద్యను రాజకీయం చేయడం దురదృష్టకరం. ఇంతవరకు ఏ ఉపాధ్యాయుడు తన ప్రతిభను చాటుకోవడం కోసం రోడ్డెక్కిన పరిస్థితి లేదు. అటువంటిది మమ్మల్ని రోడ్డెక్కించారు. - భాగ్యలక్ష్మి, కాకినాడ



పారదర్శకంగా చేపట్టారు..: కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే డీఎస్సీ ప్రకటించింది. కొన్ని సంవత్సరాలుగా కష్టపడి చదివాం. కంప్యూటర్ బేస్డ్ పరీక్ష రాశాం. అందులో ఎవరికి ఏ ప్రశ్న వస్తుందో తెలియదు. కీ విడుదలయ్యాక అన్ని తనిఖీ చేసుకుంటే వచ్చిన మార్కులు తెలిశాయి. మెరిట్‌లిస్టు ఇచ్చాక అభ్యంతరాలకు అవకాశం ఇచ్చారు. ఈ డీఎస్సీ అత్యంత పారదర్శకతతో నిర్వహించారు. ఈ డీఎస్సీ తప్పితే నాకు వయసు కూడా అయిపోతుంది. ఇన్నేళ్ల నా శ్రమ వృథా అయ్యేది. - నరేంద్ర బొడ్డు, గోపాలపట్నం



ఏ పరీక్షకైనా సిద్ధమే: డీఎస్సీలో ఉద్యోగాలు తెచ్చుకున్న తమపై అసత్య ఆరోపణలు చేసి కలత చెందేలా చేస్తున్నారు. మేం ఏ పరీక్షకైనా సిద్ధమే. దుష్ప్రచారాలు చేస్తే సముద్రంలో కలిపేస్తాం. డబ్బులిచ్చి కొనుక్కున్నారని కొందరు మాట్లాడుతున్నారు. అవును..మేం రూ.750 డబ్బులిచ్చి పోస్టు కొనుక్కున్నాం. గతంలో రూ.500 అప్లికేషన్ ధర ఉంటే గత ప్రభుత్వంలో దాన్ని రూ.750కి పెంచారు. అదనంగా రూ.250 ఎక్కువిచ్చి తెచ్చుకున్నాం. - దేముడు, విజయనగరం



దురుద్దేశంతోనే దుష్ప్రచారం: కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించడమే కాకుండా గౌరవప్రదంగా నియామకపత్రాలు అందించింది. తర్వాత శిక్షణ ఇచ్చి ఉపాధ్యాయులుగా బాధ్యతలు అప్పగించారు. మరో రెండు నెలలైతే ఉద్యోగంలో చేరి ఏడాదవుతుంది. కొందరు కావాలనే మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. చదువుకోలేని వారు కూడా ఆరోపణలు చేస్తున్నారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. - కాత సూర్యకుమారి, చింతపల్లి



హాకీలో అదరగొట్టారు!

అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాలు కైవసం


విజేతగా నిలిచిన అండర్23 అనకాపల్లి జిల్లా జట్టు


విజేతగా నిలిచిన అండర్17 జిల్లా జట్టు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

అమరావతిలో జరిగిన హాకీ పోటీల్లో అనకాపల్లి జిల్లా జట్టు ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించింది. అండర్-23, 17 బాలుర జట్లు ప్రథమ స్థానంలో నిలిచి అమరావతి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాయి. అండర్-23 విభాగంలో జరిగిన ఫైనల్స్‌లో సత్యసాయి జిల్లా జట్టుతో తలపడి 3-0 గోల్స్‌తో అనకాపల్లి జిల్లా జట్టు విజయం సాధించింది. అండర్-17 విభాగంలో తిరుపతి జిల్లా జట్టుతో తలపడిన అనకాపల్లి జిల్లా జట్టు 3-1 గోల్స్ తేడాతో విజయం నమోదు చేసింది. క్రీడాకారులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి శైలజ, కోచ్ నరేశ్ అభినందించారు.

హోరాహోరీ పోరులో విజయం..: చిన్నప్పటి నుంచి హాకీ అంటే ఇష్టం. ఎలమంచిలిలో సాధన చేసి పోటీల్లో పాల్గొన్నా. అండర్-17 విభాగంలో అనకాపల్లి జిల్లా జట్టు తరఫున ఆడా. హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో సత్తా చాటి విజేతలుగా నిలిచాం. - చైతన్య, పదో తరగతి విద్యార్థి

ఆనందంగా ఉంది..: అండర్-23 విభాగంలో జిల్లా జట్టు తరఫున ఆడి, విజయం సాధించడం ఆనందంగా ఉంది. అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలో జిల్లాకు పేరు తెచ్చేలా క్రీడాకారులంతా శ్రమించడంతో ప్రథమ స్థానంలో నిలిచాం. - కూరపాటి రమేశ్, డిగ్రీ విద్యార్థి

ప్రతిభావంతులకు గుర్తింపు..: అమరావతి ఛాంపియన్‌షిప్‌తో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు గుర్తింపు దక్కింది. పోటీలను చాలా బాగా నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా జట్టుకు హాకీలో ప్రథమ స్థానం రావడం, ఆ జట్టులో నేను ఉండటం గర్వంగా ఉంది. - జగదీశ్, డిగ్రీ విద్యార్థి

ఇదే స్ఫూర్తితో ముందుకు..: భవిష్యత్తులో దేశం తరఫున ఆడాలన్నదే లక్ష్యం. చదువుతోపాటు హాకీలోనూ రాణించేలా సాధన చేస్తున్నా. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతా. - ఆశ్లేష్, పదో తరగతి విద్యార్థి

కరాటే పోటీల్లో విజేతలకు బహుమతులు

మునగపాక, న్యూస్‌టుడే: మదర్ థెరిసా మెమోరియల్ ఫౌండేషన్, అన్నపూర్ణ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో తోటాడలో ఆదివారం రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 200 మంది పాల్గొన్నారని కోచ్ శివ చెప్పారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి ట్రోఫీలు అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు వీరునాయుడు, మాజీ ఎంపీపీ వెంకట్, కొణతాల రఘునాథ్, కుమార్ పాల్గొన్నారు.


ట్రోఫీలు అందుకున్న విజేతలతో నిర్వాహకులు

కరవు జిల్లాగా ప్రకటించాలి

ఎస్.రాయవరం: అనకాపల్లి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు, కరవు పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కరవు జిల్లాగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు కోరారు. రామయ్యపట్నం వద్ద ఖాళీ భూములను ఆదివారం పరిశీలించి, రైతులతో మాట్లాడారు. 1.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా ప్రస్తుతం 12,500 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారన్నారు. సాగునీరు అందించే వరాహ, తాండవ నదులు నీరులేక వెలవెల బోతున్నాయన్నారు.


పెరిగిన ధరలతో ఉల్లి లొల్లి

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పెరిగిన ఉల్లి ధరలు సామాన్యుల కళ్ల వెంట నీళ్లు తెప్పిస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే భారీగా ధర పెరగడంతో మధ్యతరగతి కుటుంబాలపై భారం పడుతోంది. మహారాష్ట్ర నుంచి మనకు ఉల్లి దిగుమతి అవుతుంది. ఎల్‌నినో ప్రభావం. . వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో కొత్త పంట ఇంకా సాగులోకి రాలేదు. దీంతో వ్యాపారులు పాత సరకునే ధరపెంచి విక్రయిస్తున్నారు. నిల్వ తక్కువ, డిమాండ్ ఎక్కువ ఉండటంతో ధర అమాంతం పెరిగిపోతోంది. పదిహేను రోజుల వ్యవధిలోనే రూ.55 నుంచి రూ.60 లకు చేరింది. హోల్‌సేల్‌లో రూ.50 వరకు పలుకుతోంది. దీంతో వినియోగదారులు ధరలు చూసి ఆందోళన చెందుతున్నారు. కొత్త పాయలు రావడానికి సమయం పడుతుందని, ఇప్పుడున్న ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

తెదేపా సీనియర్ నేత పినపోలు మృతి



బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి విశాఖ గ్రామీణ జిల్లా తెదేపా పూర్వ అధ్యక్షుడు, సీనియర్ నేత **పినపోలు వెంకటేశ్వరరావు** (75) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి తుది శ్వాస విడిచారు. స్వగ్రామం పి.భీమవరంలో ఆదివారం అంత్యక్రియలు జరిగాయి. ఈయన 1982-87 మధ్య సర్పంచిగా పనిచేశారు. బుచ్చెయ్యపేట పీఏసీఎస్ అధ్యక్షుడిగా మూడుసార్లు ఎన్నికయ్యారు. అదే సమయంలో డీసీసీబీ డైరెక్టర్‌గానూ పనిచేశారు. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరి 2009 ఎన్నికల్లో చోడవరం శాసనసభ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కొంతకాలంగా చోడవరంలో నివాసం ఉంటున్న ఆయన తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యసేవలు అందిస్తుండగా గుండెపోటు రావడంతో మృతి చెందారని తెలిపారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ ఆడారి రమాకుమారి, భాజపా నాయకుడు ఈర్లె శ్రీరామమూర్తి తదితరులు నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు రాజు, గంటా శ్రీనివాసరావు అంతియమాత్రలో పాల్గొని పాడె మోశారు.


పినపోలు వెంకటేశ్వరరావు పాడె మోస్తున్న ఎమ్మెల్యేలు గంటా, కేఎస్ఎన్ఎస్ రాజు

మద్యం మత్తులో కారుతో బీభత్సం


ప్రమాదానికి గురైన కారు, ద్విచక్రవాహనం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ యువకుడు కారు నడిపి.. నాలుగు ద్విచక్ర వాహనాలు, మరో కారును ఢీకొన్న ఘటన చింతపల్లి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రోడ్డుపై నిల్చున్న యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా తునికి చెందిన పడాల సాయి, మామిడి రమేష్, కిరణ్ ఆదివారం గూడెంకొత్తవీధి మండలం ధారకొండ ధారాలమ్మను దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముగ్గురు మద్యం తాగారు. జాతీయ రహదారిపై అంతర్ల వద్ద కారు అదుపు తప్పింది. సర్వీసింగ్ సెంటర్ బయట రోడ్డు పక్కనున్న నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక కారును బలంగా ఢీకొంది. రోడ్డుపై నిల్చున్న యువకుడు రమేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కారులో ఉన్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు 32 మంది ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు


బాలురు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ పాఠశాలలో జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారం జరిగాయి. 32 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సతీష్ చెప్పారు. సబ్ జూనియర్స్ విభాగంలో బాల బాలికలకు నిర్వహించిన పోటీలకు 150 మంది హాజరయ్యారన్నారు. విజయనగరం జిల్లాలో సెప్టెంబర్ 11 నుంచి 13 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యదర్శి నూకరాజు, 15 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.400 కోట్లతో మౌలిక వసతుల కల్పన

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నగరంలో ప్రజలకు అవసరమైన వసతుల కల్పనకు రూ.400 కోట్లు వ్యయం చేయడానికి ప్రభుత్వం అనుమతించిందని కమిషనర్ కేతన్‌గార్గ్ ఓ ప్రకటనలో తెలిపారు. రహదారుల అభివృద్ధి, కాలువలు, విభాగినులు, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులకు ఆయా నిధులు వ్యయం చేస్తామని.. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏకు రూ.200 కోట్ల చొప్పున నిధులు కేటాయించాలని పురపాలక మంత్రి నారాయణ పేర్కొన్నారని చెప్పారు.

ఉక్కు కార్మిక నేతపై అవినీతి ఆరోపణలు

నిలిచిన పదవీ విరమణ ప్రయోజనాలు

ఈనాడు విశాఖపట్నం: విశాఖ ఉక్కులో ఓ కార్మిక నేతపై ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని.. అతనిపై చర్యలు తీసుకోవాలంటూ ఉక్కు కార్యదర్శి, సీబీఐ, సీవీవో, సీపీ తదితరులకు ఫిర్యాదులు అందినట్టు సమాచారం. ఫ్యామిలీ పింఛను పథకం, కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్లు (సీడబ్ల్యూసీ), ఐఓడీ కేసులు, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకం(వీఆర్ఎస్) తదితర అంశాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో సదరు నాయకుని ఉద్యోగ విరమణ ప్రయోజనాలను నిలిపివేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఫిర్యాదుల నేపథ్యంలో ఈనెల 31వ తేదీతో ఉద్యోగ విరమణ చేయనున్న ఉద్యోగుల జాబితాలో సైతం సదరు నాయకుడి పేరు లేకపోవడం కర్మాగారం అంతటా చర్చనీయాంశం అయ్యింది.

వసూళ్లు ఇలా...

▼ కొవిడ్ సమయంలో మృతిచెందిన ఉక్కు ఉద్యోగుల కుటుంబాలకు ఫ్యామిలీ పెన్షన్ పథకం కింద లభించే ప్రయోజనాలను ఇప్పిస్తానని చెప్పి పలువురు బాధిత కుటుంబాల నుంచి డబ్బు వసూలు చేసినట్టు ఫిర్యాదు అందింది.

▼ కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్లలో అలంకరణ పనులు చేపట్టే గుత్తేదారు నుంచి అనధికారిక రుసుములు వసూలు చేసినట్లు తెలిసింది. సీడబ్ల్యూసీల్లో ఏటా 200 కార్యక్రమాలు వరకు జరుగుతుండగా.. సుమారు రూ.50-60 లక్షల వరకూ పక్కదారిపట్టినట్లు ఆరోపణలున్నాయి.

▼ 2020-25 మధ్య కాలంలో కర్మాగారం వెలుపల జరిగిన కొన్ని ప్రమాదాలను విధి నిర్వహణలో జరిగిన గాయాలుగా చూపించి ప్రయోజనాలు పొందినట్టు సమాచారం.

▼ అంతర్గత బదిలీలు, క్వార్టర్ల కేటాయింపులు వంటి అనేక వ్యవహారాల్లో సుమారు రూ.15 కోట్లు ఈ విధంగా వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి.

స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందకపోవచ్చని ఉద్యోగులను భయపెట్టి.. వారికి సాయం చేస్తానని చెప్పి 30-40 మంది ఉద్యోగుల నుంచి సుమారు 1.5కోట్లు వసూలు చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

పుట్టినరోజు వేడుకల్లో వన్యప్రాణుల దత్తత


దాతలకు జంతు దత్తత ధ్రువపత్రాలు అందిస్తున్న క్యూరేటర్ మంగమ్మ తదితరులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పలువురు చిన్నారులు పుట్టినరోజులను పురస్కరించుకుని ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల (జూ)లో వన్యప్రాణులను దత్తత తీసుకున్నట్లు క్యూరేటర్ జి. మంగమ్మ ఆదివారం తెలిపారు. జూలో అమలవుతున్న 'జంతు దత్తత' కార్యక్రమంలో భాగంగా గడచిన వారం రోజులుగా 10 వన్యప్రాణులను దాతలు దత్తత తీసుకుని వాటి సంరక్షణ కోసం రూ.1,46,100 విరాళంగా అందించారన్నారు. వీటిలో కొన్నింటిని ఏడాది పాటు, మరి కొన్నింటిని నెలల పాటు దత్తతగా స్వీకరించారన్నారు. రెడ్డి విహాన్‌వర్ధన్ 4 జంతువులకు(హిమాలయన్ గోరల్, చిలుక, చిరుతపులి, చారల హైనా) కలిపి రూ.38 వేలు, సియాన్ తన్వి 3 జంతువులకు(రాయల్ బెంగాల్ టైగర్, హిమాలయాన్ నల్ల ఎలుగుబంటి, చుక్కల జింక) రూ.30,600, హేమఐశ్వర్య గొల్లు కుటుంబ సభ్యులు (హిమాలయాన్ గోరల్) రూ.10 వేలు, సత్తారు కనిష్క(హిమాలయాన్ నల్ల ఎలుగుబంటి) రూ.54 వేలు, సత్తారు పాపినాయుడు, ఆరుద్ర(చారల హైనా) రూ.13,500 విరాళంగా ఇచ్చారన్నారు. దాతలకు జూ అధికారులు 'జంతు దత్తత' ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. సహాయ క్యూరేటర్లు బి.గోపి, పి.వి.చౌదరి, ఎఫ్ఎస్ఓ బి.భారతి తదితరులు పాల్గొన్నారు. దత్తత తీసుకునేందుకు ఆసక్తి ఉన్న వారు 94915 69344, 93915 26937, 78936 32900 నంబర్లలో సంప్రదించాలని క్యూరేటర్ సూచించారు.


పిల్లలు దత్తత తీసుకున్న జూలోని పలు జంతువులు

సంచార, అర్ధసంచార విముక్త జాతుల దినోత్సవం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో భాజపా ఆధ్వర్యంలో సోమవారం సంచార, అర్ధసంచార విముక్త జాతుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రావుగోపాలరావు కళాకేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సంచార జాతుల సదాచార వారసత్వం, సంస్కృతికి వారదులుగా నిలిచిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి గుర్తు చేయడానికి ఇది నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో భాజపా నాయకులు కె. శ్రీనివాసరావు, పలకారవి, కర్రిరామకృష్ణ పాల్గొన్నారు

చోరీ కేసులో నిందితుల అరెస్టు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: స్కూటర్ డిక్కీలో నగదు అపహరించిన కేసులో నిందితుడిని, ద్విచక్ర వాహనాలను చోరీలకు పాల్పడుతున్న మరో నిందితుడిని అనకాపల్లి పట్టణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. బీఆర్‌టీ కాలనీకి చెందిన ముప్పిడి రాజు పాత నేరస్థుడు. ఎన్టీఆర్ క్రీడా మైదానం వద్ద పార్కింగ్ చేసిన స్కూటీ డిక్కీ తెరిచి రెండు సెల్‌ఫోన్లు, చోడవరం రోడ్డులో పార్క్ చేసిన స్కూటీ డిక్కీ నుంచి రూ.5 వేల నగదు అపహరించాడు. రైల్వేస్టేషన్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన కేసులో ఓ బాలుడ్ని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఏడుగురు యువకులను రక్షించిన లైఫ్‌గార్డులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖపట్నం రుషికొండ తీరంలో ఆదివారం సముద్ర స్నానాలకు దిగిన ఏడుగురు యువకులు కొట్టుకుపోతుండగా జీవీఎంసీ, టూరిజం బ్లూఫ్లాగ్ బీచ్ లైఫ్‌గార్డులు వారిని రక్షించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ (రాయపుర్)కు చెందిన రాజేంద్రసత్య, మనోజ్‌తండిల్‌వాల్, కిశోర్‌కుమార్‌ఠాకుర్, తరుణ్‌వర్మ, ఆంధ్రప్రదేశ్ పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన టి.మురళీ, జి.శ్రీరామ్‌కుమార్, ఆర్.తేజశ్వర్‌రావు విహారయాత్రలో భాగంగా రుషికొండ తీరానికి విచ్చేశారు. ఈ క్రమంలో వీరు స్నానాలు కోసం సముద్రంలో దిగారు. అలల ఉద్ధృతి అధికంగా ఉండటంతో సముద్రంలో కొట్టుకుపోతున్న వీరిని లైఫ్‌గార్డులు గుర్తించి మెరైన్ పోలీసులు సహకారంతో సకాలంలో ఒడ్డుకు చేర్చారు. ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మెరైన్ సీఐ అప్పారావు, ఎస్సై మనోజ్‌కుమార్ సూచనల మేరకు ఏఎస్సై శ్రీనివాసరావు సమక్షంలో యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించి పంపించారు. సందర్శకులు సముద్ర స్నానాలు చేసే సమయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రీయ లైఫ్ సేవింగ్ సొసైటీ (ఆర్ఎల్ఎస్ఎస్), వాటర్ స్పోర్ట్స్ అధ్యక్షుడు బి.బలరామ్‌నాయుడు పేర్కొన్నారు. తీరప్రాంతాల్లో ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్న లైఫ్‌గార్డుల సేవలను కొనియాడారు.


కాపాడిన యువకులతో లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

విశాఖపట్నం, న్యూస్‌టుడే: శ్రావణ మాసం సందర్భంగా హోటల్ గ్రీన్‌పార్క్‌లో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పోలో పట్టుచీరల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోందని నిర్వాహకులు తెలిపారు. దేశం నలుమూలలు నుంచి తెచ్చిన విభిన్న సంప్రదాయ పట్టు వస్త్రాలు ప్రదర్శనలో ఉన్నాయని పేర్కొన్నారు. 50 శాతం వరకు తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే నెల రెండో తేదీ వరకు రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	114	110
లైవ్	141	130
డ్రెస్‌డ్	219	230
స్కిన్‌లెస్	247	240

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట



నివేదికలు రూపొందిస్తున్న ఉద్యోగులు

నివేదికల తయారీలో నిమగ్నం

నక్కపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అవసరమైన నివేదికల తయారీలో ఉద్యోగులు నిమగ్నమై ఉన్నారు. ఈ మేరకు వీరంతా ఆదివారం మండల పరిషత్తు కార్యాలయంలో సమావేశమయ్యారు. సోమవారం తుది జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో ఉద్యోగులంతా పోలింగ్ కేంద్రాలు, అందులోకి వచ్చే వార్డులు, ఓటర్ల తదితర వివరాలతో పై అధికారికి అప్‌లోడ్ చేశారు. ఇందులో మ్యాపింగ్ వివరాలను కూడా జత చేశారు.

వసతిగృహం చుట్టూ తుప్పల తొలగింపు

రాంబిల్లి, న్యూస్‌టుడే: ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న కేజీబీవీ-4 బాలికల వసతిగృహం చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను ఆదివారం తొలగించారు. ఈ నెల 26న లాలంకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వి.ఎస్.నాయుడుతో కలిసి కేజీబీవీ వసతిగృహాన్ని సందర్శించిన సెజ్‌లో వర్ధమాన కంపెనీ మేనేజరు పి.వెంకటేశ్వరరావుకు చుట్టూ ఉన్న తుప్పలతో భయం వెంటాడుతోందని కొందరు విద్యార్థినులు ఆయనకు వివరించారు. తుప్పలను తొలగించడంతోపాటు శుద్ధజల కేంద్రం ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు వర్ధమాన కంపెనీకి చెందిన కార్మికులు ప్రత్యేక పరికరాలతో వచ్చి తుప్పలు తొలగించారు.

గురువుకు ఘన సన్మానం

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల శివారు రాట్నాలపాలెం ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు వర్ధి ప్రసాద్‌కు పూర్వ విద్యార్థులు ఆదివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1988లో ఈ పాఠశాలలో చేరి సుమారు 12 సంవత్సరాలు ఇక్కడే పనిచేశానన్నారు.

పోలవరం ఎడమ కాలువతో నవశకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల, పక్కన మాజీ ఎమ్మెల్యే పీలా

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పోలవరం ఎడమ కాలువ ప్రారంభంతో అనకాపల్లికి నవశకం ప్రారంభం అవుతుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని రింగ్‌రోడ్డు జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం కూటమి నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించారు. గోదావరి జలాల సాధనకు కీలక ముందడుగు పడనుందన్నారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, భాజపా జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, నాయకులు పాల్గొన్నారు.

★ జార్జిక్లబ్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని, సభ్యులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. అధ్యక్షుడు దాడి బుజ్జి, కార్యదర్శి కొణతాల మురళిని శాలువాతో ఘనంగా సత్కరించారు. క్లబ్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

★ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వివిధ సమస్యలపై నియోజకవర్గ ప్రజల నుంచి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వినతులు స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అనకాపల్లి: బెల్లం మార్కెట్ యార్డులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన స్థలాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదివారం పరిశీలించారు. యార్డులో రోజు ఉదయం, సాయంకాలం నడకకు అనేక మంది వస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా పురుషులు, మహిళలు, పిల్లలకు ఉపయోగకరంగా ఉండేలా నిర్మాణం చేస్తామన్నారు.

చిట్టడవిలా ఖాళీ స్థలాలు

అనకాపల్లి, న్యూస్‌టుడే

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. కొన్నిచోట్ల మురుగునీరు చేరి, మరికొన్ని ప్రాంతాల్లో తుప్పలు పెరిగి దర్శనమిస్తున్నాయి. దోమల వ్యాప్తితో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల రఘురాం కాలనీ సమీపంలోని ఖాళీ స్థలం నుంచి పాము అక్కడున్న ఇంట్లోకి వచ్చిందని చెబుతున్నారు. లక్ష్మీనారాయణనగర్, పాత్రునికాలనీ, కర్రివారి వీధి, చంద్రబాబునాయుడు కాలనీ తదితర ప్రాంతాల్లోనూ ఇళ్లలోకి తరచూ సర్పాలు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు.



ఇళ్ల మధ్య ఖాళీ స్థలం

అనకాపల్లిలో నివేశన స్థలాల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. చాలామంది ఇంటి నిర్మాణం చేపట్టకపోయినా పెట్టుబడిగా భావించి స్థలాలను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్ పెరుగుతుండటంతో డబ్బు అవసరం లేనివారు తమ స్థలాలను విక్రయించకుండా, అభివృద్ధి చేయకుండా అలాగే వదిలేస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు తుప్పలతో చిట్టడివిలా మారాయి.

★ జీవీఎంసీ జోన్ పరిధిలోని ఖాళీ స్థలాలపై పన్ను వసూలు చేయడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. పట్టణ పరిధిలో వసూలు చేస్తున్నా విలీన గ్రామాల్లో వాటి జోలికి పోవడం లేదు. మార్కెట్ విలువలో 0.5 శాతం ఏటా పన్నుగా చెల్లించాల్సి ఉంటుంది. దీన్ని రెండు వాయిదాల్లో వసూలు చేస్తారు. జోన్ పరిధిలో 787 ఖాళీ స్థలాలు ఉన్నట్లు గుర్తించారు. ఏడాదికి రూ.1.34 కోట్లు పన్నుల రూపంలో వసూలు కావాల్సి ఉంది. వాస్తవానికి 1,500కి పైగా ఖాళీ స్థలాలు ఉన్నట్లు సమాచారం. పన్నులు సగానికి మించి వసూలు కావడం లేదు.

★ అనకాపల్లితోపాటు విలీన గ్రామాల్లోనూ లెక్కకు మించి అనధికార లేఅవుట్లు వెలిశాయి. వీఎంఆర్‌డీఏ అనుమతి పొందినవి పట్టణంలో మూడు మాత్రమే ఉన్నాయి. వాటిలో స్థలాలు కొనుగోలు చేసిన వారూ పన్నులు చెల్లించడం లేదు. అనధికార లేఅవుట్‌లోని స్థల యజమానుల గురించి చెప్పనవసరం లేదు. ఇంటి నిర్మాణానికి అనుమతి కావల్సిన వారు విధిగా ఖాళీ స్థలానికి బకాయి పడిన పన్ను చెల్లిస్తేనే అనుమతి ఇస్తారు. అటువంటి వారే ప్రస్తుతం పన్ను చెల్లిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉండే వారిలో కొందరు పన్నులు చెల్లిస్తున్నారు.

★

జీవీఎంసీకి ఎటువంటి పన్ను చెల్లించకపోయినా దర్జాగా స్థలాలను అమ్మేస్తున్నారు. వాస్తవానికి పన్ను చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ చేయాలి. ఈ నిబంధనను అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై జోనల్ కమిషనర్ చక్రవర్తిని సంప్రదించగా.. స్థల యజమానుల చిరునామాలు తెలియక నోటీసులు ఇవ్వలేకపోతున్నామన్నారు. పన్నులు చెల్లించకపోతే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం

నక్కపల్లి, న్యూస్‌టుడే: వేంపాడు వికాస తరంగిణి ఆధ్వర్యంలో నక్కపల్లి గోష్ఠి సభ్యులు ఆదివారం క్యాన్సర్‌కు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని నక్కపల్లిలో ఏర్పాటు చేశారు. విశాఖకు చెందిన ఆరోగ్య వికాస్ ద్వారా క్యాన్సర్ వైద్య నిపుణులు ఇక్కడకు వచ్చి 72 మంది మహిళలకు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేశారు. క్యాన్సర్ గుర్తింపు, ఆదిలోనే దీని నియంత్రణ తదితర అంశాలకు సంబంధించి వైద్యాధికారిణి దేవయాని వివరించారు.

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి జన్మదిన వేడుకల్లో భాగంగా ఎస్.రాయవరం నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్.రాయవరానికి చెందిన జనసేన నాయకులు వీసం సాయి ఆధ్వర్యంలో లక్ష్మీసాయి దంత వైద్యశాల, సాగర్‌దుర్గ, సింహాద్రి ఆసుపత్రులు, హైమా నేత్రాలయం వైద్యుల బృందం రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. 269 మంది వైద్య సేవలు పొందారు. అచ్యుత్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు అచ్యుత్ కుమార్, జనసేన నాయకులు పాల్గొన్నారు.



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిరుపయోగంగా పైకా భవనం



కొండకొప్పాకలో గతంలో పంచాయతీ యువజన క్రీడా, ఖేల్ అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పైకా భవనం నేడు కీటకాలకు ఆవాసంగా మారింది. క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామగ్రిని ఈ భవనంలో అందుబాటులో ఉంచేవారు. పాఠశాల విద్యార్థులకు ఈ పైకా భవనం కేంద్రంగానే క్రీడలు నిర్వహించేవారు. కాలక్రమేణా పైకా భవనాలు మూలకు చేరాయి. అధికారులు స్పందించి ప్రభుత్వ అవసరాలకు ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, క్రీడాకారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, లక్ష్మీదేవిపేట (అనకాపల్లి)

ప్రహరీకి మరమ్మతులు ఏవి?

కాంప్లెక్సు ఆవరణకు రక్షణ కరవైంది. పేటలోని దుర్గానగర్ వద్ద ఉన్న కాంప్లెక్సు చుట్టూ కొన్నేళ్లక్రితం ప్రహరీ నిర్మించారు. ఇక్కడే తహసీల్దారు, ఎంపీడీఓ, విద్య, వ్యవసాయశాఖ సహా మరో ఆరు శాఖల భవనాలున్నాయి. వీటిలో విలువైన కంప్యూటర్లు, రికార్డులు ఉంటాయి. దీనిచుట్టూ ఉన్న ప్రహరీ రెండు చోట్ల పడిపోయింది. రెండు వైపులా గేట్లు వేసి ఉన్నప్పటికీ ఆకతాయిలు, మందుబాబులు కూలిన ప్రదేశాల్లోంచి లోపలికి వచ్చేస్తున్నారు. కార్యాలయాల ఆవరణలో రాత్రిపూట తిష్ఠ వేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోంది. అధికారులు స్పందించి ప్రహరీకి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, పాయకరావుపేట



రోడ్డు వేశారు.. సమస్య తీర్చారు..



చవితిన వీధిలో సీసీ రోడ్డు పనులు

స్పందనకు వందనం

అనకాపల్లి పట్టణం: అనకాపల్లిలో చవితిన వీధిలో నెలకొన్న సమస్యను పరిష్కరించేలా జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల23న 'కాలువతో సరి రోడ్డు మరిచారు' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన వార్తకు స్పందించిన అధికారులు సీసీ రోడ్డు పనులు ఆదివారం మొదలుపెట్టారు. దీంతో ఇబ్బందులు తొలగాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అ వీ ఇ వీ

సేవలను విస్తృతం చేయాలి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: సత్యసాయి సేవలను విస్తృతం చేయాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. పట్టణంలో గౌరీ గ్రంథాలయంలో ఆదివారం జిల్లా సత్యసాయి సేవా సంఘాల కన్వీనర్ల సమావేశం జరిగింది. కసిరెడ్డి అప్పలనాయుడు, కామరాజు, భారతి పాల్గొన్నారు.

మునగపాక, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సత్యసాయి భజనమండలి జోన్ ఇన్‌ఛార్జ్ రామారావు అన్నారు. మండలంలో మెలిపాక, తిమ్మరాజుపేటలో భజనమండలి సభ్యులు ఆదివారం 60 పండ్ల మొక్కలు నాటారు.

సమస్యల పరిష్కారానికి నిరాహారదీక్షలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనకాపల్లి ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం రిలేనిరాహార దీక్ష ప్రారంభించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి శంకరరావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని దశల వారీగా ఆందోళన చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 30 నుంచి నిరాహార దీక్షలు చేపట్టినట్లు వివరించారు.

కశింకోట, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు దీక్షలు కొనసాగిస్తామని కశింకోట ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ముక్తకంఠంతో తెలిపారు. నిరసనపై కనీస స్పందన లేకపోవడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీక్షల్లో ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శరగడం హేమంత్, వైస్ ప్రిన్సిపల్ కె.శివ, బి.గణేష్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు రొట్టెల పంపిణీ

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలను ఆదివారం పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు జన్మదిన వేడుకల సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి, వైకాపా మండల కమిటీ అధ్యక్షులు పైల రమేష్, సిద్దాబత్తుల సత్తిబాబు, ఆ పార్టీ కార్యకర్తల చేతుల మీదుగా వాటిని అందజేశారు. అనంతరం కేక్ కట్ చేశారు.

ఏళ్ల కలలకు వంతెన

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల మండలం పందూరు-రామచంద్రపురం వరాహనదిపై నిర్మాణ పనుల్లో ఉన్న వంతెన పూర్తికావస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే అయిదు గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తీరనున్నాయి. నీలం, హుద్‌హుద్ తుపాన్ల సమయంలో ఈ వంతెన కూలిపోయింది.



జోరుగా సాగుతున్న వంతెన నిర్మాణ పనులు

2014 ఎన్నికల్లో తెదేపా అధికారంలోకి వస్తే వంతెనను నిర్మిస్తామని హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారమే వరాహనదిపై వంతెనను నిర్మించడానికి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసి, పనులు చేస్తుండగా, 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైకాపా వీటిని గాలికొదిలేసింది. దీంతో పందూరు, రామచంద్రపురం, ములగల్లోవ, గూడుపులోవ, బంద గ్రామాల ప్రజలు వరాహనదిలో దిగి అవతల ఒడ్డుకు వెళ్లేవారు. ఈ సమయంలో నది ఉద్ధృతంగా మారితే నది దాటడానికి ప్రాణాలు పణంగా పెట్టాల్సిన సందర్భాలు ఎదురయ్యేవి.

★ 2024లో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణ పనులను మళ్లీ ప్రారంభించింది. మరో రూ.5.75 కోట్లు నాబార్డు నుంచి నిధులను మంజూరు చేసింది. దీంతో వంతెన పనులను జోరుగా సాగుతున్నాయి. వంతెన నిర్మాణం చివరి దశకి రావడంతో తమ కల నెరవేరబోతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అక్టోబరు నాటికి అందుబాటులో..

వంతెన పనులను త్వరగా చేస్తున్నాం. అప్రోచ్ రోడ్డు, తారు నిర్మాణం, వరాహనది వైపు రాయికట్టు నిర్మాణపనులు ఉన్నాయి. అక్టోబరునాటికి పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. –సత్యనారాయణ, జేఈ, పంచాయతీరాజ్, కోటవురట్ల



జాతీయ రహదారా.. తటాకమా?



కశింకోట నుంచి సంపతిపురం వెళ్లే దారి దుస్థితి

మేజరు పంచాయతీ కశింకోట-సంపతిపురం రహదారిలో కల్వర్టు లేక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి అగ్రహారం మీదుగా సంపతిపురం వెళ్లేదారిలో జాతీయ రహదారి పక్కన కల్వర్టు లేకపోవడంతో నిత్యం ఇక్కడ నీరు నిలిచిపోయి తటాకంలా మారుతోంది. దీంతో వాహనదారులు మలుపు తిప్పేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు. 2015లో సుమారు రూ.కోటితో డివైడర్లతో సహా సీసీ రోడ్డు నిర్మించారు. కానీ కల్వర్టు ఏర్పాటుచేయలేదు. గతంలో వార్డు సభ్యుడిగా ఉన్న కందాల జగన్నాథరావు తాత్కాలిక కల్వర్టు ఏర్పాటు చేయించారు. అది కాస్తా కొట్టుకుపోవడంతో తిరిగి ఇబ్బందులు మొదలయ్యాయి. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని వాహనచోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కశింకోట

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలో గవరపాలెం శ్రీగౌరీ పంచాయతన దేవాలయంలో అమ్మవారి ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం లక్ష కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు జరిపించారు. ఆలయ మండపంలో జరిగిన సామూహిక లక్ష కుంకుమార్చనలో పెద్ద సంఖ్యలో దంపతులు, భక్తులు పాల్గొన్నారు. వేద మంత్రోచ్ఛారణ, భక్తిగీతాల మధ్య కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. కార్యక్రమంలో గౌరీ సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఆళ్ల మహాలక్ష్మి నాయుడు, మళ్ల సూర్యప్రకాశ్, బుద్ధ రమణాజీ పాల్గొన్నారు.



ఆలయ శిఖరాన్ని ఊరేగిస్తున్న భక్తులు



కుంకుమార్చనలో భక్తులు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని వేల్పుల వీధి రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ముందుగా స్వామికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మహిళలు అష్టోత్తర పఠనం, గీతాలు ఆలపించారు.

ఘనంగా శిఖర ఊరేగింపు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: భీమవరం గ్రామదేవత నూకాంబిక అమ్మవారి ఆలయ శిఖరం పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయ శిఖరం, బోనాలను వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ శిఖరాన్ని సోమవారం పునఃప్రతిష్ఠ చేయనున్నట్లు కమిటీ సభ్యులు అతికంశెట్టి కోటేశ్వరరావు తెలిపారు.

స్తంభాన్ని ఢీకొన్న కారు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: తిమ్మరాజుపేట-పెదపాడు రోడ్డులో అతివేగంగా దూసుకెళ్లిన కారు నల్లమారమ్మ గుడి వద్ద విద్యుత్తు స్తంభాన్ని ఆదివారం ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడ్డారు. కారు ముందు భాగం నుజ్జయింది. స్తంభాన్ని ఢీకొని రోడ్డుకు అడ్డంగా కారు బోల్తాపడింది. స్థానికులు కారు అద్దాలు పగలగొట్టి క్షతగాత్రులను బయటకు తీశారు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.



వేతనాలు విడుదల చేయాలని నిరసన

అచ్యుతాపురం: ఆరు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని వీటిని వెంటనే విడుదల చేయాలని పంచాయతీ కార్మికులు ఆందోళన నిర్వహించారు. పూడి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం దుర్మార్గమని సీఐటీయూ మండల కార్యదర్శి సోమునాయుడు అన్నారు.

ముగిసిన ప్రత్యేక ఓటరు శిబిరాలు

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి): సర్ ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లోని 1636 పోలింగ్ కేంద్రాల పరిధిలో రెండు రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. బీఎల్‌ఓలు ఓటరు జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించారు. ప్రజల భాగస్వామ్యం పెంచేలా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ శిబిరాలను ఎన్నికల అధికారులు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. ఫారం-6, 7, 8లు అందుబాటులో ఉంచారు. ఓటరు నమోదుపై యువ ఓటర్లకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన వారి దగ్గర నుంచి ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

అనకాపల్లి, న్యూస్‌టుడే: స్థానిక బాలాజీరావుపేటలోని కాలువల్లో మురుగునీరు నిలిచిపోతోంది. దుర్వాసన భరించలేకపోతున్నాం. – ఎస్.రామలక్ష్మి, అనకాపల్లి, ✓: కాలువలు శుభ్రం చేయిస్తాం. – రవి కుమార్, శానిటరీ సూపర్‌వైజర్, జీవీఎంసీ, అనకాపల్లి

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో రాజుగారి బీడులో పలు కాలనీలకు ఏర్పాటు చేసిన సీసీ మార్గాలు కాలువలకు అనుసంధానంగా పలకలు ఏర్పాటు చేయలేదు. – కాలనీవాసులు, ✓: సమస్యపై క్షేత్రస్థాయిలో పర్యటించి పలకలు ఏర్పాటు చేస్తాం. – శివరామ్, కార్యదర్శి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కొండకర్ల వద్ద నిర్మాణంలో ఉన్న రోడ్డుపై నీటిని జల్లకపోవడంతో భారీగా దుమ్మూధూళీ వస్తోంది. – మున్నా, కొండకర్ల. ✓: సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. –పద్మిని, ఏఈ, ఆర్‌అండ్‌బీ, అచ్యుతాపురం.

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారికి గోతులు పడ్డాయి. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. – రాజేంద్ర, అనకాపల్లి, ✓: మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. – గోపాలకృష్ణ, జీవీఎంసీ ఈఈ, అనకాపల్లి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని బృందావనంలో పందుల సంచారం అధికంగా ఉంది. చిన్న పిల్లలపై దాడి చేస్తున్నాయి. – ఎ.వి.సూర్యనారాయణ, స్థానికుడు, ✓: పందులను పట్టణంలోకి రాకుండా చర్యలు చేపడతాం. పెంపకందారులకు తాఖీదులు ఇస్తాం. – వై.సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం



సహాయ కమిషనరు & కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయం గవరపాలెం,
అనకాపల్లి పట్టణం & జిల్లా -531002, ఫోన్: 08924-226823, 9491000713

ఇ ప్రొక్యూర్‌మెంట్ మరియు టెండర్-కం-బహిరంగ వేలం ప్రకటన

సి. నెం. 107036/SNAT/AKP/2026 తేది. 30-08-2026

ఈ క్రింది విషయములు గూర్చి టెండర్ కం బహిరంగ వేలము తేది: 16.09.2026 బుధవారం నాడు నిర్వహించబడును.

క్రమ సంఖ్య	వివరము	ప్రథమ ధరావత్తు మొత్తము రూ.	కాలపరిమితి
1.	రసవర్గములు (సరఫరా) కొరకు	రూ. 2,00,000/-	తే 01-10-2026 ది నుండి తే 31-03-2027 ది వరకు
2.	శ్రీ అమ్మవారికి భక్తులచే సమర్పించి వదిలి వేయబడిన పప్పులు గాజులు వగైరాలు తీసుకొనే హక్కునకు	రూ. 50,000/-	అప్పగించిన తేది నుండి సంవత్సరం కాలపరిమితికి

1. పై 1వ లైసెన్సు హక్కునకు ఇ ప్రొక్యూర్‌మెంటు ద్వారా ఇ బిడ్స్ కోరబడుచున్నవి. లైసెన్సు హక్కు షెడ్యూల్ కొరకు www.eprocurement.gov.in ద్వారా లాగిన్ apendowmentsmarketing నందు తేది: 31.08.2026 నుండి 12.09.2026 సాయంత్రం గం.3.00ల వరకు బిడ్ సమర్పించవచ్చును. టెక్నికల్ బిడ్ తేది: 16.09.2026, ప్రైస్ బిడ్ తేది: 16.09.2026 ఉదయం గం.10.50ల నుండి తెరువబడును.
3. పై లైసెన్సు 1 నకు టెండర్ కం బహిరంగ వేలము నందు పాల్గొను పాటదారుడు, వారి యొక్క సాల్వెన్సీ సర్టిఫికేట్, పాస్ పోర్ట్ సైజు ఫోటో మరియు ఐ.డి మరియు అడ్రస్ ప్రూఫ్ గా పాన్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జెరాక్స్ లను పాట ప్రారంభమునకు ముందుగా అధికారులకు చూపించి జెరాక్స్‌లను అధికారులకు ఇవ్వవలెను. అట్లు లేని యెడల వారి వద్ద నుండి ధరావత్తు స్వీకరించబడదు. కాపీ తప్పని సరిగా జతపర్చవలెను.
4. దేవాలయం పునర్నిర్మాణం పనులు జరుగుచున్న సందర్భంగా పాట తేదికి ఉన్న పరిస్థితులు బట్టి అవసరమైన కొన్ని షరతులు విధించుటకున్నూ తగు మార్పులు చేయుటకున్నా, ఏకారణము చేతనైనను పై జాబితా నందు పాటలను రద్దు పరుచుటకు / వాయిదా వేయుటకు దేవస్థానము కార్యనిర్వహణాధికారి వారికి అధికారము కలదు. ఇతర షరతులు, వివరములు కార్యాలయము పనివేళల యందు తెలుసుకొనవలెను. ఫోన్ నెం. 08924-226823, 9491000713.

శ్రీ అమ్మవారి దేవస్థానంకు విరాళములు ఇచ్చు దాతలు ప్రక్కన యున్న బార్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా సమర్పించవచ్చును. సదరు వివరములను 9491000713 కి whatsup ద్వారా తెలియపరచగలరు. మరియు భక్తుల సౌకర్యం కొరకు ఆన్ లైన్ ద్వారా దర్శనములు ప్రత్యేక- పరోక్ష సేవలు www.aptemples.ap.gov.in. ద్వారా బుక్ చేసుకొనవచ్చును.

శ్రీ పీలా నాగశ్రీను (గొల్లబాబు)
ఛైర్మన్ & ధర్మకర్తలు

సం/- వై. శ్రీధర్
సహాయ కమిషనరు & కార్యనిర్వహణాధికారి

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

మాకవరపాలెం, న్యూస్‌టుడే : యువత చెడు అలవాట్లు, తప్పుడు మార్గాలకు దూరంగా ఉండడంతో పాటు దేశాభివృద్ధిలో ముందుండాలనే ఉద్దేశంతో ప్రతి నెలా చివరి ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్నట్లు భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు శీరంరెడ్డి సూర్యనారాయణ అన్నారు. ఆదివారం టీవీలో ప్రసారమైన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని భాజాపా నాయకులు తిలకించారు. దేశ వ్యాప్తంగా జరిగిన అభివృద్ధితో పాటు వ్యవసాయం, యువతకు ఉన్నత భవిష్యత్ మార్గాలు తదితర అంశాలపై మోదీ ప్రసంగించారని సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు మత్రినాయుడు, కార్యదర్శి బాబురావు, సీనియర్ నాయకులు రాంబాబు, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాలకు లబ్ధిదారుల గుర్తింపు



పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ సంతోష్‌కుమార్

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: వినికిడి లోపం కలిగిన 26 మందికి వినికిడి యంత్రాలను సెప్టెంబరు 4న శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు జన్మదినం సందర్భంగా పంపిణీ చేయనున్నారు. ఆదివారం ఇక్కడ నిర్వహించిన పరీక్షల శిబిరానికి 133మంది హాజరయ్యారు. ఈఎన్‌టీ నిపుణుడు కె.సంతోష్‌కుమార్ వీరిని పరీక్షించి అర్హులను ఎంపిక చేశారు. ఒక్కో వినికిడి యంత్రానికి రూ.14వేలు చొప్పున వెచ్చించనున్నామని మార్కెట్‌కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ తెలిపారు.

అడ్డొచ్చాయని అడ్డంగా నరికేస్తున్నారు..



విజయరామరాజుపేట సమీపంలో రోడ్డు పక్కనున్న చెట్లను తొలగించారిలా..

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ కోసం ఓ పక్క రూ.లక్షలు ఖర్చు చేసి మొక్కలు పెంచుతుంటే.. మరోవైపు విచక్షణా రహితంగా నరికేస్తున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం కారణంగా ప్రజాధనం వృథా కావడమే కాక పర్యావరణానికి హాని కలుగుతోంది. చోడవరం-వడ్డాది మార్గంలో బీఎన్ రహదారి పక్కన భారీ వృక్షాలు ఉన్నాయి. విద్యుత్తు లైన్ల ఏర్పాటు కోసం అడ్డుగా ఉన్నాయంటూ సంబంధిత సిబ్బంది ఆ మార్గంలో అడ్డొచ్చిన చెట్లను నరికేస్తుండడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొమ్మలు తొలగించకుండా చెట్లను తొలగించడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వడ్డాది-నర్సీపట్నం, బుచ్చెయ్యపేట మార్గాల్లో పదుల సంఖ్యలో చెట్లను ఇలా నరికేశారని వాపోతున్నారు.

భూవివాదంపై సిబ్బంది ఆరా..

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని కల్యాణపులోవలో దళిత రైతు పెదపూడి కొండబాబు భూమికి సంబంధించిన సరిహద్దుపై నెలకొన్న వివాదం పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. కొండబాబుకు చీమలపాడు రెవెన్యూ పరిధిలో కొంత భూమి ఉంది. ఆ భూమిని వేరొకరు ఆక్రమించి ప్రశ్నించిన రైతుపై దౌర్జన్యానికి పాల్పడడంతో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పట్టించుకోకపోవడంతో బాధిత రైతు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో సంబంధిత సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిహద్దు రాళ్లను గుర్తించి వారి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

అర్జునగిరిలో సమస్యలతో సతమతం

చీడికాడ, న్యూస్‌టుడే

చీడికాడ మండలం అర్జునగిరిలో కొన్నేళ్లుగా సమస్యలు రాజ్యమేలుతున్నాయి. చిన్నపాటి సమస్యలు కూడా పరిష్కరించకపోవడంతో మూడు వేల మంది జనాభా ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలోనూ ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

▼ ఆర్టీసీ బస్సు సదుపాయం లేకపోవడంతో కళాశాలలకు, ఏపీ మోడల్ స్కూల్‌కి వెళ్లే విద్యార్థులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎవరైనా వేర్వేరు పనులపై వెళ్లాలంటే ఆటోలు, ద్విచక్ర వాహనాలే దిక్కు. ఉదయం పూట మాత్రమే ఒక బస్సు వస్తుంది. తురువోలు నుంచి చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం ప్రాంతాలకు నాలుగైదు మార్లు బస్సులు తిప్పాలని స్థానికులు కోరుతున్నారు.

▼ గ్రామంలోని పంచాయతీ కార్యాలయ సమీప బీసీ కాలనీలో డ్రైనేజీ శిథిలమైంది. రామాలయం, దారబంధ చెరువు సమీప పాఠశాలకు వెళ్లే మార్గాల్లో మురుగు నీరు ప్రవహిస్తోంది. ఇళ్లలోని వాడుక నీరు రోడ్డుపైకి రావడంతో గుంతలు పడ్డాయి.



రామాలయం వద్ద మురుగునీరు రావడంతో దెబ్బతిన్న తారురోడ్డు

▼ తురువోలు-చోడవరం ఆర్అండ్‌బీ మార్గంలో అర్జునగిరి వద్ద రోడ్డు అంచు వరకు ఆక్రమించేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

▼ శివారు ప్రాంతాల్లో వీధి లైట్లు లేక అంధకారం అలముకుంటోంది.

▼ రజకుల వీధిలో సిమెంటు రోడ్డు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.



కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

▼ అర్జునగిరి సచివాలయం చీడిపల్లి రోడ్డు శివారున ఉంది. దీనికి ప్రహరీ నిర్మించి, రక్షణ కల్పించాల్సి ఉంది.

▼ మురుగు సమస్య పరిష్కరించి, వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇతర సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. పంచాయతీ సిబ్బందికి తగిన సూచనలు చేస్తాం. —కోటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీఓ, చీడికాడ

విద్యా శాఖకు వన్నె తెచ్చారు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: ఎంఈఓ ప్రసాద్ అంకితభావంతో పనిచేసి విద్యా శాఖకు వన్నె తెచ్చారని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. మండల విద్యాశాఖాధికారి-2గా పనిచేసి ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న డి.వి.డి.ప్రసాద్‌కి ఆదివారం వీడ్కోలు సభ నిర్వహించారు. హాజరైన అతిథులు ప్రసాద్ దంపతులను శాలువాలతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఆర్జేడీ బి.విజయభాస్కర్, అనకాపల్లి డీఈఓ నాగేశ్వరరావు, శ్రీకాకుళం డీఈఓ రవిబాబు, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనూరాధ, అయ్యన్న విద్యాసంస్థల అధినేత ఖాసిం, ముత్రు ముత్యాలనాయుడు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎంఈవో ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, అధికారులు

నేడే చివరి సర్వసభ్య సమావేశం

నాతవరం, న్యూస్‌టుడే: సోమవారం మండల పరిషత్తు చివరి సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపీడీవో సత్యనారాయణ శ్రీనివాస్ తెలిపారు. ఎంపీపీ లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందని ఎంపీడీవో తెలిపారు.

నూకాంబిక ఆలయానికి రహదారి సౌకర్యం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది నూకాంబిక ఆలయానికి రోడ్డు నిర్మించేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు గ్రామపెద్దల ఆధ్వర్యంలో అందరూ సమావేశమయ్యారు. అవసరమైన స్థలం ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడంతో బీఎన్ రోడ్డు నుంచి ఆలయం వరకు రహదారి నిర్మించనున్నారు. ఈ సందర్భంగా స్థల దాతలను సన్మానించారు. ముందుగా రోడ్డు నిర్మించి తర్వాత ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని కమిటీ సభ్యులు చెప్పారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని నాయకులు పేర్కొన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ తాతయ్యబాబు, జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు అదనపు వసతి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రం దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అదనపు భవన సముదాయం సమకూరుతోంది. సమగ్ర శిక్షా విభాగం ఆధ్వర్యంలో రూ.50 లక్షల వ్యయంతో కొత్త భవన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ భవనంలో గ్రంథాలయం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ గదితో పాటు అదనపు తరగతి గది ఉంటాయి. దాదాపు పూర్తి దశకు చేరుకున్న ఈ భవనాన్ని త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నట్లు సమగ్ర శిక్షా ఏఈఈ సంతోష్ తెలిపారు.



కొత్తగా నిర్మిస్తున్న భవనం

చమ్మచింతలో పోలీసుల మెరుపు దాడి



కురువాడలో స్వాధీనం చేసుకున్న పత్రాలు లేని వాహనాలు

నాతవరం, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా ఆపరేషన్ వజ్రహార్ కార్యక్రమాన్ని ఆదివారం చమ్మచింత పంచాయతీ తాండవలో నిర్వహించారు. నర్సీపట్నం గ్రామీణ సీఐ ఎల్.రేవతమ్మ ఆధ్వర్యంలో వివిధ స్టేషన్లకు చెందిన 56 మంది పోలీసులు 8మంది ఎస్సైలతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈమేరకు 300 ఇళ్లల్లో సోదాలు జరిగాయి. సరైన పత్రాలు లేని 35 బైకులు, ఒక ఆటో, 180 ఎంఎల్ మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మెరుపు దాడిలో 600 మంది వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంజాయి సాగు రవాణా, పాత నేర చరిత్రగల నివాసాలపై ప్రత్యేక దృష్టి సారించారు. 15మందిని గంజాయి రాపిడ్ కిట్లతో పరీక్షలు నిర్వహించి ఒకరికి పాజిటివ్ ఉన్నట్టు తెలిపారు. చమ్మచింత, కురువాడలో మాదక ద్రవ్యాల వినియోగం నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నర్సీపట్నం సబ్‌డివిజన్‌లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహిస్తామని సి.ఐ. రేవతమ్మ తెలిపారు. నాతవరం, నర్సీపట్నం, గొలుగొండ, కె.డి.పేట సిబ్బంది పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ప్రేమసమాజంలో టీమ్ జనసేన ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. గాజువాకకు చెందిన వందేమాతరం బ్లడ్ బ్యాంక్ సహకారంతో దీన్ని నిర్వహించారు. 100 మంది రక్తదానం చేయగా.. వారికి జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్ రాజు ప్రశంసాపత్రాలు అందించారు. నియోజకవర్గ వీరమహిళ అధ్యక్షురాలు నందవరపు రమాదేవి సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చీడికాడ-తురువోలు రోడ్డుకు మోక్షం



గుంతలకు తారు మిశ్రమంతో మరమ్మతు చేస్తున్న కార్మికులు



ఘాట్‌రోడ్డు కూడలి నుంచి మాడుగుల మార్గంలో...

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ-తురువోలు ఆర్అండ్‌బీ రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. మండలంలోని ప్రధానమైన ఈ రోడ్డు భారీగా గుంతలు పడి పదుల సంఖ్యలో గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై పలుమార్లు 'ఈనాడు'లో వెలువడిన కథనాలకు ప్రభుత్వం స్పందించి మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంతో అధికారులు పనులు చేపట్టారు. ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఘాట్‌రోడ్డు కూడలి నుంచి మాడుగుల వరకు రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం ఈ రోడ్డు పూర్తిగా గుంతమయం కావడంతో మాడుగుల వెళ్లడానికి ప్రయాణికులు నానా ఇబ్బందులు పడేవారు. దీనిపై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కృషి మేరకు మేజర్ డిస్ట్రిక్ రోడ్డు నిధుల నుంచి రూ.60 లక్షలు మంజూరు కావడంతో ఈ పనులు జరగడానికి మార్గం సుగమం అయింది.

అరకొర సిబ్బందితో అవస్థలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: లోపూడి స్వర్ణ గ్రామం కార్యాలయ సిబ్బంది పనితీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో పనులు జరగక ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. ఇక్కడ డిజిటల్ అసిస్టెంటు పోస్టుతో పాటు మరికొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది కూడా వేర్వేరు కారణాలతో అందుబాటులో ఉండడం లేదని స్థానికులు అంటున్నారు. పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి అనారోగ్యంపై సెలవు పెట్టగా ఎల్.సింగవరం కార్యదర్శి బృందకి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ఒక రోజు కార్యాలయం అసలు తెరవలేదని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా ఏటిగట్టు పండగ

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామానికి చెందిన గ్రామపెద్దలు, యువకులు, రైతులు చందాలు వేసుకొని పెద్దేరు జలాశయం వద్ద ఏటిగట్టు పండగ నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని ఏటా ఈ పండగ చేపట్టడం ఆనవాయితీగా వస్తోందని రైతులు తెలిపారు. ఈ క్రమంలోనే ఆదివారం జలాశయం వద్ద పాలు పొంగించి, గ్రామ రైతులకు భోజనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నీటి సంఘం డైరెక్టర్లు పెంటారు, కొండలరావు, రాజునాయుడు, నారాయణరావు, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గణపతి హోమం

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో సోమవారం ఉదయం 8గంటల నుంచి లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు చలపతి తెలిపారు. సంకటహర చతుర్థి సందర్భంగా ఈ హోమం జరుగుతుందని అన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: లక్కవరం ఎస్సీ కాలనీలో ఫ్యూజ్‌బాక్స్ ప్రమాదకరంగా ఉంది. అందినంత ఎత్తులో ఉండడం, సరైన రక్షణ లేకపోవడం, విద్యుత్తు తీగలు బయటకు కనిపిస్తుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఆ పరిసరాల్లో చిన్నపిల్లలు ఆడుకునేటప్పుడు, మూగజీవాలు సంచరించినప్పుడు ప్రమాదం పొంచి ఉన్నట్లేనని అంటున్నారు. సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి తగిన రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ఆలయానికి దాతల విరాళం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారి ఆలయంలో పంచలోహ మకరతోరణం ఏర్పాటుకు అప్పన్న వెంకటరమణ, త్రినాథమ్మ కుటుంబ సభ్యులు రూ.25 వేలు అందజేసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ గొల్లవిల్లి సంజీవిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, దాతలు, అర్చకులు పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతరకు ఏర్పాట్లు

కృష్ణదేవిపేట: మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో సెప్టెంబర్ 3న జరిగే మరిడమ్మ అమ్మవారి జాతరకు ఉత్సవ కమిటీ చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. ప్రధాన కూడలిలో విద్యుత్తు దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ స్థలాలు చదును చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు తారకవేణుగోపాల్ ఆధ్వర్యంలో అమ్మవారి మూడురోజుల జాతరకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.



రేవళ్లు సమీప పొలాల్లో వాలిన స్తంభాలు

ఏ క్షణాన కూలిపోతాయో..

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పంట పొలాల్లో విద్యుత్తు స్తంభాలు ఈదురుగాలులకు ఊగుతూ భయాందోళన కలిగిస్తున్నాయి. లక్కవరం-చోడవరం మార్గంలో సరుగుడుతోట వద్ద ఒక స్తంభం, రేవళ్ల పంట పొలాల్లో రెండు స్తంభాలు ఏటవాలుగా ఉండి ఏ క్షణం కూలిపోతాయోనని భయాందోళన కలిగిస్తున్నాయి. చోడవరం నుంచి గవరవరం గ్రామానికి వెళ్లే దారిలోనూ కొన్నిచోట్ల ఇదే పరిస్థితి. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జనసేన ఆత్మీయ సమావేశం

చీడికాడ, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబరు 2న ప్రతి గ్రామంలోనూ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ చీడికాడ మండల అధ్యక్షుడు జి.వి.మూర్తి సూచించారు. ఈ మేరకు జనసేన పార్టీ మండల స్థాయి శ్రేణుల ఆత్మీయ సమావేశం ఆదివారం చీడికాడలో నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీకి బలం ఉన్నచోట బరిలో ఉంటామని నాయకులు స్పష్టం చేశారు. గెలుపే లక్ష్యంగా సమష్టిగా పని చేయాలని సూచించారు. చెట్టుపల్లిలో రక్తదాన శిబిరం, తునివలసలో అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. మిగిలిన గ్రామాల్లో మొక్కలు పంపిణీ చేస్తామని, ఖండివరంలో దేశభక్తి గేయాల పాటల పోటీలు నిర్వహిస్తామని మూర్తి పేర్కొన్నారు.



సమావేశంలో జనసేన మండల అధ్యక్షుడు మూర్తి, ఇతర నాయకులు

వేచలంలో మార్మోగిన సత్యసాయి నామస్మరణ

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న వారికి సేవ చేయాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు అన్నారు. సత్యసాయి బాబా శత జయంత్యుత్సవం సందర్భంగా 101 గ్రామాల్లో.. 101 భజనల కార్యక్రమాన్ని ఆదివారం దేవరాపల్లి మండలం వేచలం రామాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి ఆధ్యాత్మికతతో మెలగాలన్నారు. ఈ సందర్భంగా భజనలు నిర్వహించి, మొక్కలు నాటారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, జోన్ కన్వీనర్ రవిశంకర్, ఆర్.వి.కె.నాయుడు, సుబ్రహ్మణ్యస్వామి, కన్నూరి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న రఘుపాత్రుని లక్ష్మణరావు

రద్దు చేసిన బస్సులు పునరుద్ధరించరూ..

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కె.కోటపాడు మీదుగా గతంలో తిరిగిన బస్సులను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. విజయనగరం జిల్లా ఎస్‌కోట డిపోనకు చెందిన రెండు బస్సులు ఎస్.కోట, కొత్తవలస, పాతవలస, కె.కోటపాడు మీదుగా చోడవరం వరకు రాకపోకలు చేసేవి. ఆ రోజుల్లో అందరికీ ఇవి బాగా ఉపయోగపడ్డాయి. తర్వాత తగిన ఒఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) లేదనే కారణంతో రద్దు చేశారు. అంతకుముందు విజయనగరం నుంచి కొత్తవలస, ఆనందపురం, కె.కోటపాడు, చోడవరం, నర్సీపట్నం మీదుగా తూర్పుగోదావరి జిల్లా కాకినాడ వరకు ఎక్స్‌ప్రెస్ బస్సు తిరిగేది. ఆ సర్వీసును కూడా రద్దు చేయడంతో కాకినాడ వైపు ఎవరైనా వెళ్లాలంటే అనకాపల్లి లేదా విశాఖపట్నం చేరుకుని అక్కడి నుంచి ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

★ పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకుని చోడవరం నుంచి వెంకన్నపాలెం, చౌడువాడ, కె.కోటపాడు, పినగాడి మీదుగా విశాఖ వరకు బస్సులు నడపాలని; ఆనందపురం, కె.కోటపాడు, చౌడువాడ మీదుగా చోడవరం వరకు బస్సులు తిప్పాలని స్థానికులు కోరుతున్నారు. చోడవరం, కె.కోటపాడు, కొత్తవలస మీదుగా విజయనగరానికి; విజయనగరం జిల్లా ఎస్.కోట నుంచి వేపాడ, ఆనందపురం, కె.కోటపాడు, చౌడువాడ మీదుగా అనకాపల్లి వరకు ఆర్టీసీ బస్సులు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'తారు' ధర మరుగుతోంది...

పనుల్లో జాప్యం వెంటాడుతోంది!!

పెదబొడ్డేపల్లి (నర్సీపట్నం), న్యూస్‌టుడే: పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారతదేశానికి రావాల్సిన తారుపై పడింది. తారురోడ్ల ప్రగతి ముందుకు సాగడం లేదు. ప్రధానంగా నర్సీపట్నం సబ్‌డివిజన్ పరిధిలోనే ఆర్ అండ్‌బీ శాఖకు సంబంధించి పలు రహదారుల పరిస్థితి ప్రశ్నార్థకమైంది. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రకటించిన 'పల్లెపండగ' పైనా ఈ ప్రభావం చూపే అవకాశముందని అంచనా వేస్తున్నారు. యుద్ధానికి ముందు టన్ను తారు ధర రూ.40 నుంచి 45 వేల వరకూ పలికేది. యుద్ధం కారణంగా టన్ను ధర 90వేలకు పైగా పలుకుతోంది. దీంతో గుత్తేదారులు, అధికారుల్లో ఈ విషయం చర్చనీయమైంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రతిపాదనలో ఉన్న మిగతారోడ్ల పరిస్థితి ఏమిటని చర్చించుకుంటున్నారు.

★ పెదబొడ్డేపల్లి నుంచి నర్సీపట్నం (వయా డాన్ బాస్కో కాలేజీ) రోడ్డుతోపాటు నర్సీపట్నం మండలం బయ్యపురెడ్డిపాలెం, కొండల అగ్రహారం నుంచి కుసర్లపూడి, రాచపల్లి నుంచి కైలాసపట్నం తదితర రహదారులన్నీ తారువేసిన తరువాత మిగులు పనులకోసం ఎదురుచూస్తున్నాయి.

★ బీఎన్‌రోడ్డుకి సంబంధించి పెదబొడ్డేపల్లి సబ్‌కలెక్టరు బంగ్లా దగ్గర, వెలంకాయపాలెం-చెట్టుపల్లి మధ్యలో కల్వర్టు మరమ్మతు పనులు పూర్తయినప్పటికీ కేవలం తారు కోసమే చూస్తున్నామని వీటితోపాటు పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో మరిన్ని రోడ్లున్నాయని బీఎన్.రోడ్డు (ఆర్అండ్‌బీ) ఏఈ లోవతల్లి నాయుడు 'న్యూస్‌టుడే'కి తెలిపారు. అయితే గడచిన రెండు నెలలతో పోల్చుకుంటే ప్రస్తుతం టన్ను తారుధర రూ.70నుంచి 75వేలకు మధ్యలో ఉందని గుత్తేదారులు చెబుతున్నారు.



పెదబొడ్డేపల్లి డాన్‌బాస్కో కాలేజీరూట్లో తారు కోసం నిరీక్షణ

శిథిల భవనాలు.. అరకొర వసతులు



మౌలిక వసతుల్లేని కొత్తపెంట పశువుల ఆసుపత్రి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: పశు వైద్యశాలల్లో మౌలిక వసతుల్లేక, పాత భవనాల్లో ఉద్యోగులు బిక్కు బిక్కు మంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. దేవరాపల్లి మండలంలో ఐదు పశువైద్యశాలలున్నాయి.

★ దేవరాపల్లిలో రెండు దశాబ్దాల కిందట భవనం నిర్మించాక నిర్వహణ పట్టించుకోకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. విద్యుత్తు వైర్లు వేలాడుతున్నాయి. ఇక్కడ తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం లేదు.



బీటలు వారిన దేవరాపల్లి పశువైద్యశాలలో విరిగిపోయిన కిటికీలు

★ మామిడిపల్లిలోని భవనానికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

★ కొత్తపెంటలో భవనం అధ్వానంగా ఉండగా, ఎం.అలమండలో బీటలు వారింది.

★ వేచలం పశు వైద్యశాలకు సొంత భవనం లేక అరకొర వసతుల మధ్య ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ప్రతిపాదనలు పంపించాం: దేవరాపల్లి భవనం దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మిగతా భవనాల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. –గాయత్రీ దేవి, దేవరాపల్లి పశువైద్యాధికారి

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1
ఇరుముడి
స్క్రీన్-2:
విశ్వనాథ్ అండ్ సన్స్

సంప్రదాయబద్ధంగా అప్పన్న స్వామి నిత్యకల్యాణం



సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం ఆదివారం సింహగిరిపై సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని అలంకరించి ఆలయ బేడామండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. వేద మంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల వివాహ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

'మూడుసార్లు పంచింగ్ తగదు'

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ఉద్యోగులు విధుల ప్రారంభ, ముగింపు సమయాల్లో పంచింగ్ చేస్తారు. ఇపుడు మధ్యలో కూడా పంచింగ్ చేయాలంటూ ఉక్కు యాజమాన్యం కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని సిటూ ఆదివారం విడుదల చేసిన ఓ కరపత్రంలో పేర్కొంది. మూడో పంచ్ పేరుతో ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మాని కర్మాగారం అభివృద్ధికి సరైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

90598 98721 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

?: సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం పాత పోస్టాఫీస్ వీధిలోని మురుగు కాలువలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. – జి.సూర్యనారాయణ, ✓: పరిశీలించి పేరుకుపోయిన చెత్తను తొలగిస్తాం. – పి.అనంద రావు, గ్రామ కార్యదర్శి

?: సబ్బవరం మండలం మల్లునాయుడు పాలెం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం ఎదుట పేరుకుపోయిన వ్యర్థాలను పదిహేను రోజులుగా తొలగించలేదు. – ఎస్.సత్యనారాయణ, ✓: త్వరితగతిన పేరుకుపోయిన వ్యర్థాలు తొలగిస్తాం. – చైతన్య వర్మ, డిప్యూటీ ఎంపీడీవో, సబ్బవరం

?: వేపగుంట, న్యూస్‌టుడే : 93వ వార్డు వెంకటాద్రినగర్‌లో శునకాలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. – శేఖరమంత్రి శ్రీనివాస రావు, ✓: సిబ్బంది కుక్కలను పట్టుకునేలా చర్యలు తీసుకుంటాం. – అప్పలనాయుడు, ఏఎంహెచ్‌వో

అధ్వాన దారులు.. అద్దంలా మారే



స్వయంభూవరం-సోమునాయుడు రహదారి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని వివిధ గ్రామాల రహదారులు అద్దంలా దర్శనమిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో రాళ్లుతేలి గుంతలమయంగా దర్శనమిచ్చేవి. నాటి పాలకులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు, పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎక్కడికక్కడ గుంతలతో నరకయాతన అనుభవించారు. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఈ పరిస్థితులను గుర్తించిన కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మరింత చొరవ తీసుకున్నారు. దీంతో స్వయంభూవరం నుంచి మూలస్వయంభూవరం మీదుగా సోమునాయుడుపాలెం వెళ్లే ప్రధాన రహదారి, కలపాక-గొల్లలపాలెం మార్గం, వాడచీపురుపల్లి-వెంకటాపురం రోడ్డు, పెదముషిడివాడ-విజయరాంపురం మొత్తం నాలుగు రహదారులను అభివృద్ధి చేశారు. వీటికి నాబార్డు తదితర నిధులు రూ. 3 కోట్లు పైగా వెచ్చించారు. రహదారులపై నల్ల పిక్కతో పాటు దానిపై తారు లేయర్ వేసి రోలింగ్ చేయించడంతో దారులు సుందరంగా రూపుదిద్దుకున్నాయి. దీంతో రాకపోకలు సాఫీగా సాగిపోతున్నాయి. ఎట్టకేలకు రహదారులను బాగు చేయించడంతో ఇబ్బందులు తీరాయని స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కలపాక-గొల్లలపాలెం రోడ్డు ఇలా..

నేడు చీమలాపల్లిలో తెదేపా విస్తృత స్థాయి సమావేశం

సబ్బవరం, న్యూస్‌టుడే: తెదేపా పెందుర్తి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం వేపగుంట రోడ్డు చీమలాపల్లి మీనాక్షి కన్వెన్షన్ హాల్-2లో సోమవారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని తెదేపా సబ్బవరం మండల అధ్యక్షుడు గండి ముత్యాలునాయుడు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెదేపా జోనల్ కో-ఆర్డినేటర్, ఇచ్ఛాపురం శాసన సభ్యులు బెందాళం అశోక్, విజయనగరం జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్, నియోజకవర్గ పరిశీలకులు గొంప కృష్ణ, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు పాల్గొంటారన్నారు. నియోజకవర్గ సీనియర్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ బూత్ కన్వీనర్లు, తెదేపా కుటుంబ సభ్యులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'144 ఎకరాల భూసమస్య పరిష్కారానికి కృషి చేస్తా'



భీమిలి ఎమ్మెల్యే గంటాతో రైతుల సమస్యపై చర్చిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల, మాజీ కార్పొరేటరు బల్ల శ్రీనివాసరావు, రైతులు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలో వీఎంఆర్డీఏ, రైతులకు మధ్య ఉన్న 144 ఎకరాల వివాదాస్పద భూసమస్యను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. వేపగుంట-జుత్తాడ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు టీడీఆర్‌లు వెంటనే ఇప్పించాలని కోరుతున్నా అధికారులు ఇవ్వడం లేదని స్థానిక రైతులు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మాజీ కార్పొరేటరు బల్ల శ్రీనివాసరావు సారథ్యంలో రైతులు శనివారం రాత్రి గంటా కార్యాలయానికి వెళ్లి సమస్యను వివరించారు. గతంలో ఇదే భూమితో ముడిపడి ఉన్నప్పటికీ రహదారులు అభివృద్ధి చేసి టీడీఆర్‌లు ఇచ్చారని, అదే పద్ధతిలో తమకు కూడా ఇప్పించాలని కోరారు. కొద్దిరోజుల్లో నగరానికి రానున్న మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని గంటా హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. రహదారి నిర్మాణ పనులను రైతులు శనివారం ఉదయం అడ్డుకున్న విషయం తెలిసిందే. టీడీఆర్‌ల కోసం పోరాటం చేయడం తప్పుకాదని, పనులు అడ్డుకోవడం సరికాదని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, పెందుర్తి

2న జనసేన సేవా కార్యక్రమాలు

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాకలో జనసేన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం పీసీసీ సభ్యుడు కోన తాతారావు అధ్యక్షతన నిర్వహించారు. వచ్చేనెల 2వ తేదీన జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆరోజు ఉదయం 9 గంటలకు గాజువాకలో బైక్ ర్యాలీ, 11 గంటలకు కేరళ నుంచి లైవ్‌లో పవన్ కల్యాణ్ మాట్లాడతారన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న జన సైనికులు

సరవ(దేవపుంట), న్యూస్‌టుడే: నాయకులు సామాజిక సేవతో జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడం సమాజానికి ఎంతో ప్రయోజనకరమని 88వ వార్డు సీనియర్ జనసేన నాయకుడు పళ్ల జనార్దన శ్రీకాంత్ అన్నారు. సెప్టెంబరు 2న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని వార్డు జనసేన యువకులు, తాపవట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సేవా కార్యక్రమాలతో అభిమానులు జన్మదిన వేడుకలు జరపాలని పవన్‌కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సూచనలతో తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. 40 మంది జనసైనికుల నుంచి వైద్యబృందాలు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ప్రవీణ్, శివ, నవీన్, అశోక్, శ్రీను, బొబ్బిలిశ్రీను, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి చినగంట్యాడ ప్రాంతానికి చెందిన వెల్లెకింది భగవంత్ గౌడ్ ఆదివారం రూ.1,01,116 విరాళాన్ని సమర్పించారు. విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావుకు అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదాశీస్సులతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



ఏఈవో తిరుమలేశ్వరరావుకు చెక్కు అందిస్తున్న దాతలు

వేంకటాద్రిపై ముగిసిన చాతుర్మాస్య పూజలు



వేంకటాద్రిపై శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై శ్రీనివాసుడి సన్నిధిలో పదహారు రోజుల పాటు జరిగిన చాతుర్మాస్య పూజలు ఆదివారం మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణంతో సంప్రదాయబద్ధంగా పరిసమాప్తమయ్యాయి. ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. వేదమంత్రాల నడుమ హోమం నిర్వహించి మహాపూర్ణాహుతి జరిపించారు. అనంతరం దేవేరుల సమేతుడైన మలయప్ప స్వామిని వధూవరులుగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ శాంతి కల్యాణోత్సవం జరిపించారు. 108 మంది దంపతులు కంకణధారణ చేసి కల్యాణ క్రతువుల్లో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

నేడు నేస్తాలమ్మ అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వాడచీపురుపల్లి పంచాయతీ పరిధి దళాయిపాలెంలో కొత్తగా నిర్మించిన శ్రీనేస్తాలమ్మ అమ్మవారి ఆలయాన్ని సోమవారం ప్రారంభోత్సవం చేయనున్నారు. గ్రామపెద్దలు, నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామస్థులు, దాతల సహకారంతో నిర్మించిన ఆలయంలో ఉదయం 10.49 గంటలకు వేదపండితుల మంత్రాల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన ఉంటుందన్నారు. భక్తులు తరలివచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదానికి గురైన ఘటన ఆదివారం ఉదయం పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ డి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్ వెంకటాపురం ప్రాంతానికి చెందిన బొడ్డేటి జశ్వంత్ (24), తుర్లు గోపాలపట్నం ప్రాంతానికి చెందిన రిజ్వాన్ (20) స్నేహితులు. ఆదివారం నాయుడుతోట సమీప కల్యాణ మండపంలో శుభకార్యానికి ద్విచక్రవాహనంపై వచ్చారు. పని ముగించుకుని బీఆర్టీఎస్ మధ్య మార్గంలో గోపాలపట్నం వైపు వెళ్తుండగా కారును అధిగమించే క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో జశ్వంత్‌కు కాలు విరిగింది. రిజ్వాన్ తలకు గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కారును స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను విచారిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు.

మురుగు కాలువకు మోక్షమెప్పుడో?

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం ఇరువాడ గ్రామంలో మురుగు పోయేందుకు కాలువ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. రామాలయం నుంచి ఊరి చివరి వరకు మురుగు నీటి కాలువ లేకపోవడంతో దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నారు. మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడి బాధపడుతున్నారు. తాము కష్టపడి పని చేసిన కూలి డబ్బులు ఆసుపత్రులకు పోయాల్సి వస్తోందని గ్రామస్థులు వెల్లడించారు. గ్రామంలోని ప్రధాన కాలువ పనికి సీసీ డ్రైనేజ్ నిర్మించి తమ కష్టాలు గట్టెక్కించాలని ఇదివరకు చాలా సార్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబును కోరామన్నారు. త్వరలోనే కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. ఆ దిశగా వెంటనే నిధులు మంజూరు చేయించి కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఇరువాడలో సీసీ కాలువకు నోచుకోని డ్రైనేజీ

నీటి సరఫరాకు అవాంతరం.. తప్పని తిప్పలు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి జోన్‌లోని జీవీఎంసీ వార్డుల పరిధిలో తాగునీటి సరఫరాకు తరచూ అవాంతరాలు జరుగుతున్నాయని పలు కాలనీలకు చెందిన నివాసితులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం నీటి సరఫరా జరగాల్సి ఉండగా కొన్ని ప్రాంతాల్లో రెండు రోజులకు ఒకసారి సరఫరా అవుతోందని వాపోయారు. ఒక్కోసారి వరుసగా రెండు రోజులు నీరు రావడం లేదని పేర్కొన్నారు. సిబ్బందిని ప్రశ్నిస్తే మరమ్మతులు జరుగుతున్నాయని సమాధానమిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఒక్కోసారి మధ్యాహ్నం పూట నీరందిస్తున్నారని తెలిపారు. సమయపాలన లేకపోవడంతో పాటు అస్తవ్యస్త సరఫరా కారణంగా వివిధ పనుల కోసం బయటకు వెళ్లే వారు ఇబ్బంది పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రతిరోజు సక్రమంగా నీటి సరఫరా చేయడంతో పాటు సమయపాలన తప్పకుండా క్రమపద్ధతిలో నీరందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ బోరులో నీరొచ్చేదెలా సారూ..!

వేపగుంట, న్యూస్‌టుడే: వెంకటసాయినగర్‌లో మంచినీటి బోరు మట్టిలో కూరుకుపోయి నెలలు గడుస్తోంది. బోరు హెడ్ పూర్తిగా తుప్పుపట్టి ఊడిపోయింది. అయినా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలా గైతే ఈ బోరుతో ప్రయోజనం ఏమిటంటూ కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడి సామాజిక భవనం వద్ద ఫంక్షన్‌లు జరిగితే మంచి నీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా మంచినీటి బోరును బాగు చేయించి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మట్టిలో కూరుకుపోయిన బోరు

శిథిల వంతెనపై.. భయం భయం



శిథిలావస్థలో వంతెన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం కలపాక నుంచి తిక్కవాని పాలెం, దళాయిపాలెం వెళ్లే మార్గంలో ఎన్టీపీసీ ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్తు ప్లాంటు సమీపంలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో వాహనదారుల గుండెల్లో దడ పుట్టిస్తోంది. 20 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం పెద్ద రంధ్రాలు పడటంతో పాటు ఇనుప చువ్వలు తుప్పు పట్టి బయటకు దర్శనమిస్తున్నాయి. వంతెన మీదుగా రాకపోకలు సాగించాలంటే భయమేస్తోందని, మరో గత్యంతరం లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ పయనించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. వంతెన నేడో మాపో అన్నట్లుగా ఉండటంతో భయాందోళన చెందుతున్నారు. వంతెనకు రంధ్రం పడిన ప్రదేశం వద్ద గొట్టాలు పెట్టి చేతులు దులిపేసుకున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



వంతెనకు పడిన రంధ్రం

మార్షల్ ఆర్ట్స్‌లో క్రీడాకారుల సత్తా

గురుద్వారా, న్యూస్‌టుడే: చెన్నై, విశాఖ నగరాల్లో ఈ నెలలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తమ సంస్థ క్రీడాకారులు అత్యున్నత ప్రతిభ కనబరిచారని నగరానికి చెందిన పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు పి.నరసింహారావు తెలిపారు. ఆదివారం గురుద్వారా దరి వసంతబాల పాఠశాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎనిమిది మంది స్వర్ణ, 12 మంది రజత పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం జిల్లా ఎస్పీ రామోజీ రమేశ్ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. అనంతరం పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన శివరామకృష్ణ, పృథ్వీరాజ్‌లను సౌత్ ఇండియా, రాష్ట్ర కరాటే చీఫ్ ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ అధ్యాపకులు ఎస్‌వీ రమణ, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో సంఘం ప్రతినిధులు

ఉన్నత లక్ష్యాల సాధనకు చర్యలు

పెందుర్తి, న్యూస్‌టుడే: గ్రామాల్లో యువత భవిష్యత్తు తరాలకు ఆదర్శవంతంగా నిలవాలని పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ సూచించారు. పెందుర్తి పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి గుర్రమ్మపాలెం, ఆదివారం రాత్రి రాజయ్యపేట గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా సీఐ సతీశ్‌కుమార్ గ్రామాల్లోని యువతతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సమాజాన్ని చైతన్యపరిచేలా వ్యవహరించాలన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల నియంత్రణ, ఓటీపీ మోసాలు, మాదకద్రవ్యాలు, తదితర అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు.



గుర్రమ్మపాలెంలో యువతకు సూచనలిస్తున్న సీఐ సతీశ్‌కుమార్

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని మాజీ కార్పొరేటర్, తెదేపా సీనియర్ నేత రౌతు శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఈ.మర్రిపాలెంలో ఆదివారం నిర్వహించిన ఇంటింటికీ తెదేపా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. గత రెండేళ్ల కాలంలో ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిందన్నారు. ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన పనులను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు జెర్రిపోతుల అప్పారావు, శ్రీనివాసరావు, మహేష్, దేముడు, చెల్లారావు, గణేశ్ పాల్గొన్నారు.



కరపత్రాలు చూపుతున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరావు, తదితరులు

డంపింగ్‌యార్డుల్లా కాలనీలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం, టిడ్కో కాలనీల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. కొద్ది రోజులుగా వ్యర్థాలను తరలించకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. వ్యర్థాలు కుళ్లి దుర్గంధం రావడంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల బెడద ఎక్కువ కావడంతో కంటినిండా నిద్ర కరవైందని గగ్గోలు పెడుతున్నారు. కాలనీలో పందుల బెడద సైతం అధికంగా ఉంది. వ్యర్థాలను పందులు చిందరవందరగా చేయడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాలనీల్లో చెత్తకుప్పలను తొలగించాలని కోరుతున్నారు.



గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పేరుకుపోయిన చెత్త



సాయినగర్ కాలనీలో 60 అడుగుల రహదారి పక్కన వ్యర్థాలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం సాయినగర్ కాలనీలో 60 అడుగుల రోడ్డు పక్కన వ్యర్థాలు వేయడంతో డంపింగ్‌యార్డుగా మారింది. నెలల తరబడి అధికారులు అలానే వదిలేయడంతో ఈగలు, దోమలు పెరిగిపోయాయి. వర్షాలకు తడిసి దుర్వాసన రావడంతో భరించలేకపోతున్నామని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. జ్వరాలు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని చెబుతున్నారు. పంచాయతీ అధికారులకు పదేపదే చెబుతున్నా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లంకెలపాలెం పాఠశాలకు క్రీడా ప్రతిభా పురస్కారం

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు (2026) లభించింది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అనకాపల్లిలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి జీజీఎస్ నాగేశ్వరరావు చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో పాఠశాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొని 119 పాయింట్లతో జిల్లాలో మూడోస్థానంలో నిలవడంతో ఈ అవార్డు లభించినట్లు తెలిపారు.



డీఈవో చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న హెచ్ఎం నాగేశ్వరరావు, పీడీలు

గంట వ్యవధిలో ఆభరణాల రికవరీ

పీఎంపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆటోలో మర్చిపోయిన విలువైన ఆభరణాలు, ల్యాప్‌టాప్‌ను పీఎంపాలెం నేర విభాగం పోలీసులు గంటల వ్యవధిలోనే రికవరీ చేసి బాధితులకు అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మారికవలస గాయత్రీ కళాశాలలో బీటెక్ చదువుతున్న జి.దినేష్, అతని సోదరి శరణ్యలు స్థానికంగా వసతిగృహంలో ఉంటున్నారు. ఆదివారం ఉదయం నగరానికి వెళ్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో ఎక్కి తిరిగి మధురవాడ వచ్చారు. ఈ సందర్భంలో తాము ప్రయాణించిన ఆటోలో విలువైన బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్ తదితర సామగ్రి మరిచిపోయారు. తర్వాత విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్రైం ఎస్సైఎస్.సూర్యప్రకాష్, కానిస్టేబుల్ రవినాయక్‌లు ఆటో యూనియన్ సహకారంతో వారు ప్రయాణించిన వాహనాన్ని గుర్తించి బ్యాగ్‌ను సురక్షితంగా స్వాధీనం చేసుకుని బాధితులు పోగొట్టుకున్న వస్తువులను అప్పగించారు.

ఉత్సాహంగా నడక పోటీలు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వ వార్డు పాత గోశాల ప్రాంతానికి చెందిన ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం జిల్లాస్థాయి నడక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. క్లబ్ అధ్యక్షుడు టి.మురళి, కార్యదర్శి రామారావు ఆధ్వర్యంలో జరిగిన పోటీలను వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఔత్సాహికులు పాత గోశాల కూడలి నుంచి అప్పన్నపాలెం వరకు నడక పోటీల్లో పాల్గొన్నారు. విశాఖ జిల్లా వాకర్స్ క్లబ్ గవర్నర్ ఆర్ఆర్ఎస్.మహేశ్, ఎలక్ట్ గవర్నర్ జ్యోతి కమల, డాక్టర్ పైడిశ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్లబ్ ప్రతినిధులు బి.సత్యనారాయణ, రామకృష్ణ కవి తదితరులు పాల్గొన్నారు.



పాత గోశాల వద్ద పోటీలను ప్రారంభిస్తున్న వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యనారాయణ

యువత క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

రామ్‌నగర్, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తపాలా శాఖ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ఆదివారం క్రీడలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు నిర్వహించిన ర్యాలీని పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్‌వీఎస్ఎన్ రాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యం, ఆరోగ్యకరమైన జీవనశైలి, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్రీడలు మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. యువత రోజువారీ జీవితంలో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ పి.కోమల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్

పరవాడ, న్యూస్‌టుడే: నిత్యావసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ గొర్లెవానిపాలెం టిడ్కో కాలనీలో ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం పాల్గొని మాట్లాడారు. నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. రేషన్ డిపోల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను ప్రజలకు అందించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అరుణ, వరలక్ష్మి, రాజకుమారి, దేవి, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పార్టీకి కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గాజువాక క్యాంపు కార్యాలయంలో పీఎస్ఆర్ సంస్థల యజమాని, న్యాయవాది పెంటకోట శంకరరావు తెదేపాలో చేరిన సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి అభినందించారు. యువత నాయకులు పాల్గొన్నారు.

పోలీసు స్పోర్ట్స్ మీట్‌కు న్యాయనిర్ణేతల నియామకం

గాజువాక, న్యూస్‌టుడే: వచ్చేనెల 1 నుంచి నాలుగురోజులపాటు మంగళగిరిలో నిర్వహించనున్న ఏపీ పోలీసు స్పోర్ట్స్ మీట్‌కు న్యాయ నిర్ణేతలుగా విశాఖ నగరానికి చెందిన మాజీ సైనికుడు జి.ఈశ్వరరావు, విశాఖ పోర్టుకు చెందిన సీహెచ్ చినబాబు, బి.గణపతిరెడ్డిలు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ స్పోర్ట్స్ కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు.